నేటి అలంకారం మహాలక్ష్మీదేవి

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

కృష్ణా జిల్లా వార్తలు

శుక్రవారం 26 సెప్టెంబరు 2025



శివాత్రినయనీ కాత్యాయనీ..



ఘాట్‌రోడ్డు మీదుగా ముందుకు సాగుతున్న నగరోత్సవం

ఇంద్రకీలాద్రికి పోటెత్తుతున్న భక్తజనం


- 2016 తర్వాత కాత్యాయనిగా దుర్గమ్మ దర్శనం
- తెల్లవారుజాము నుంచే బారులు తీరిన భక్తులు
- దర్శనానికి 2 గంటల సమయం

ఉదయమంతా ఉత్సవ వైభోగం.. సాయంకాలం సాంస్కృతిక వైభవంతో ఇంద్రకీలాద్రి ముమ్మారు ముచ్చటపడి మురిసిపోతోంది. ఉభయదాతల కుంకుమార్చనలు.. ఆడపడుచుల వాయినాలు.. సువాసినీ పూజలు.. జల్లుస్నానాలు.. తలనీలాలు.. అన్నప్రసాదాలతో తెలుగునాట ఆధ్యాత్మిక వాతావరణమంతా బెజవాడలోనే విరబూసిందా.. అన్నట్టుగా దసరా శరన్నవరాత్రి సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. తొమ్మిదేళ్ల తర్వాత కాత్యాయనిగా కొలువైన అమ్మ దివ్యమంగళ స్వరూపాన్ని తిలకించేందుకు గురువారం భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకోగా, సాయంసంధ్యవేళ నగరోత్సవంతో ఇంద్రకీలాద్రి అపర కైలాసగిరిని తలపించింది.

విజయవాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రికి భక్తుల తాకిడి పెరుగుతోంది. 2016 తర్వాత ఈ దసరా ఉత్సవాల్లో గురువారం కాత్యాయనీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మను చూసేందుకు తెల్లవారుజామున 4 గంటల నుంచి భక్తులు బారులు తీరారు. రథం సెంటర్ నుంచి ప్రధానాలయం వరకు క్యూలైన్లు కిటకిటలాడుతూ కనిపించాయి. దర్శనానికి సుమారు 2 గంటల సమయం పట్టింది. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు 62,669 మంది అమ్మవారిని దర్శించుకున్నారు. 14,730 మంది అన్నప్రసాదం స్వీకరించారు. దర్శనానికి ఎంత సమయం పడుతుందన్న విషయాన్ని తెలుసుకోవడానికి కలెక్టర్ లక్ష్మీశ క్యూలైన్‌లో నడుచుకుంటూ ప్రధానాలయానికి చేరుకున్నారు. భక్తుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. కాగా, శుక్రవారం మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చే దుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులు భారీగా వస్తారని అంచనా వేశారు. రద్దీకి తగ్గట్టుగా ఏర్పాట్లు చేశారు. శ్రీదుర్గామల్లేశ్వరుల తెప్పోత్సవానికి దుర్గాఘాట్‌లో హంస వాహనాన్ని సిద్ధం చేస్తున్నారు.



కాత్యాయనీదేవిగా దుర్గమ్మ ఉత్సవమూర్తి



దుర్గాఘాట్‌లో సిద్ధమవుతున్న హంసవాహనం







దుర్గాఘాట్‌లో కృష్ణమ్మకు నవహారతులు





కేరళ డ్రమ్స్‌లో కళాకారుడి విన్యాసం





నాగాయలంక రేవు వద్దకు చేరిన వరద నీరు

వరద ఉధృతి

ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు భారీగా నీటి విడుదల

- శ్రీరామపాదక్షేత్రంలోని పుష్కరఘాట్‌కు చేరిన నీరు
- పులిగడ్డ ఆక్విడెక్ట్‌కు సమాంతరంగా ప్రవాహం

నాగాయలంక/అవనిగడ్డ రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు భారీగా నీటిని విడుదల చేస్తుండటంతో కృష్ణానదిలో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. గురువారం 3.18 లక్షల క్యూసెక్కులు వదలడంతో నాగాయలంక శ్రీరామపాదక్షేత్రంలోని పుష్కర ఘాట్‌కు నీరు పోటెత్తింది. ఘాట్‌లోని కృష్ణవేణమ్మ విగ్రహం, శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం లోకి నీరు ప్రవేశించింది. ఘాట్‌లోని మెట్లు దాటి పైపైకి వస్తోంది. ఈ నేపథ్యంలో గ్రామస్థులు, సందర్శకులు రేవులోకి వెళ్లకుండా పోలీసుశాఖ మిగతా 6లో..

జిల్లాలో ఈ-క్రాప్ నమోదు గడువు మరో నాలుగు రోజుల్లో ముగియనుంది. జూలైలో ఈ ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటివరకు సుమారుగా 67 శాతం పూర్తి చేశామని చెబుతున్న వ్యవసాయ శాఖ అధికారులు ఆ వివరాలు మాత్రం వెల్లడించకుండా గోప్యత పాటిస్తున్నారు. ఈ-క్రాప్ నమోదును గడువు ముగిసేలోగా ఎంతమేర పూర్తిచేస్తారనే అంశంపై అనేక అనుమానాలు నెలకొన్నాయి. ఇటీవల కలెక్టర్ బాలాజీ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఈ-క్రాప్ నమోదుతో పాటు, ఈకేవైసీ కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. అయినా ఈ ప్రక్రియ కొలిక్కిరాలేదు. దీంతో జేసీ మల్లారపు నవీన్ వ్యవసాయశాఖ అధికారులతో గురువారం మాట్లాడి ఈ-క్రాప్ నమోదు ఎంతమేర చేశారనే అంశంపై ఆరా తీశారు. త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు.

తీవ్ర జాప్యం!

జిల్లాలో పూర్తికాని ఈ-క్రాప్ నమోదు

- మరో నాలుగు రోజుల్లో ముగియనున్న గడువు
- వీఏఏల బదిలీ వ్యవహారం వివాదాస్పదం
- విధులకు దూరంగా సిబ్బంది.. పట్టించుకోని అధికారులు



వరి పొలం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలో ఈ ఏడాది వరి సాగు అంచనా 4.12 లక్షల ఎకరాలుగా ఉంది. వ్యవసాయశాఖ అధికారులు గత జూలై 20వ తేదీ నుంచి ఈ-క్రాప్ నమోదును ప్రారంభించారు. సెప్టెంబరు 15వ తేదీ నాటికి ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉన్నా వివిధ కారణాలతో ఈ నెలాఖరుకు గడువును పెంచారు. ఈ-క్రాప్ నమోదును పూర్తి చేసిన తర్వాత ఈ జాబితాలను రైతు సేవా కేంద్రాలు, సచివాలయాల వద్ద నోటీస్ బోర్డుల్లో ఉంచాలి. ఈ జాబితాలపై గ్రామ సభలు నిర్వహించి రైతుల సమక్షంలో తనిఖీలు పూర్తిచేయాల్సి ఉంది. ఈ జాబితాలపై రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి, వాటిని పరిష్కరించిన తర్వాత తుది జాబితాలను ప్రకటించాలి. ఇందుకోసం వారంరోజుల పాటు కసరత్తు చేయాలి. అయితే ఈ ప్రక్రియను ఎప్పటికి పూర్తి చేస్తారనే అంశంపై సందిగ్ధత నెలకొంది. రెండు నెలల క్రితం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో(ఆర్ఎస్‌కే) పనిచేస్తున్న వ్యవసాయశాఖ అసిస్టెంట్ (వీఏఏ)లను ఇతర మండలాల్లోని ఆర్ఎస్‌కేలకు బదిలీ చేశారు. వీరిలో కొంతమంది బదిలీలు సక్రమంగా జరగలేదనే కారణాలు చూపి కలెక్టరేట్‌లో ఆందోళనలకు దిగారు. వీరి సమస్య పరిష్కారం కాకపోవడంతో కొందరు వీఏఏలు హైకోర్టును ఆశ్రయించారు. ఇటీవల వీఏఏలకు అనుకూలంగా తీర్పు రావడంతో వారం రోజుల క్రితం వీఏఏలు జిల్లా వ్యవసాయశాఖ జేడీ కార్యాలయానికి వచ్చారు. కోర్టు ఉత్తర్వుల మేరకు తమను దగ్గరలోని గ్రామాల్లో నియమించాలని కోరారు. ఉన్నతాధికారులతో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ మిగతా 6లో..

దుర్గమ్మకు సాంస్కృతిక నీరాజనం 8

జిల్లా వాసులపై సైబర్ కేటుగాళ్ల ఉచ్చు

- వాట్సాప్ కాల్ చేసి నగదు డిమాండ్

చక్కనితల్లికి చాంగుభళా



విజయవాడ ఉత్సవ్‌లో వైభవంగా సాంస్కృతిక ప్రదర్శనలు

- పవిత్ర సంగమంలో 300 మంది కళాకారుల బృంద నాట్యం
- సంగీత కళాశాల, తుమ్మలపల్లిలో అలరించిన నాట్యాంశాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ) : ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు కనులపండువగా జరుగుతుండగా, కొండ కింద సాంస్కృతిక మహోత్సవాలు భక్తులకు కనువిందు చేస్తున్నాయి. విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా కొండపల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో, ఇటలీ తెలుగు అసోసియేషన్, జయహో భారతీయం ఆధ్వర్యంలో పవిత్ర సంగమం వేదికగా గురువారం 'నృత్య సంగమం' ఆవిష్కృతమైంది. 'అయిగిరినందిని నందితమోదిని విశ్వవినోదిని నందినుతే..' అనే ఆదిశంకరాచార్యుల కీర్తనకు 300 మంది మిగతా 6లో..




తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో..

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఎమ్మెస్ చౌదరి బృందం ప్రదర్శించిన కపిరాజు, చిరుమేఘం నాటికలు సందేశాత్మకంగా సాగాయి. పల్నాడుకు చెందిన చిన్న ఆంజనేయుల తోలుబొమ్మలాట ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, శ్రీకాకుళానికి చెందిన సత్తిరాజు బృంద తప్పెటగుళ్లు ఆహూతులను అలరించాయి. తాడేపల్లికి చెందిన యడ్లవల్లి బుర్రకథ గానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గుంటూరుకు చెందిన రాజ్యలక్ష్మి గాత్ర కచేరీ రసరమ్యంగా సాగగా, ఎన్‌టీకే మ్యూజిక్ అండ్ డ్యాన్స్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాంశాలు దుర్గమ్మ కళానివేదన సమర్పించాయి.

దసరా
శరన్నవరాత్రి మహోత్సవాలు 2025





ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ భక్తులకు గురువారం కాత్యాయని దేవిగా దర్శనమిచ్చారు. ఈ ఏడాది ఉత్సవాల్లో ఇది కొత్త అలంకారం. అమ్మవారిని కాత్యాయనిదేవి అలంకారంలో దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

మూడోరోజు రూ.32.92 లక్షలు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దసరా మహోత్సవాలలో మూడోరోజు బుధవారం దేవస్థానానికి వివిధ రూపాల్లో మొత్తం రూ.32,92,628లు ఆదాయం సమకూరినట్టు ఈవో వీకే శీనానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.300లు టిక్కెట్‌ల ద్వారా రూ.7,82,700లు, రూ.100ల ద్వారా రూ.3,41,800లు, లడ్డూ ప్రసాదం (ఒక్కొక్క లడ్డూ రూ.15లు) ద్వారా రూ.3,81,185లు, రూ.100ల లడ్డూ ద్వారా రూ.15,35,700లు లభించినట్టు పేర్కొన్నారు. పరోక్ష ప్రత్యేక కుంకుమార్చనల (టిక్కెట్టు రూ.3వేలు) టిక్కెట్టుల ద్వారా రూ.66వేలు, పరోక్ష ప్రత్యేక కుంకుమార్చన (టిక్కెట్టు రూ.5వేలు) టిక్కెట్‌ల ద్వారా రూ.20 వేలు, ప్రత్యేక ఖడ్గమాలార్చన (టిక్కెట్ రూ.5,116లు) టిక్కెట్ల ద్వారా రూ.66,508లు పుస్తకాలు, ఫోటోలు, క్యాలెండర్ల ద్వారా రూ.9,615లు, తలనీలాల సమర్పణ టిక్కెట్ల ద్వారా రూ.84,120లు మొత్తం కలిపి రూ.32,92,628లు లభించినట్టు ఈవో వివరించారు. కాగా, గత ఏడాది దసరాలో మూడోరోజు వివిధ రూపాల్లో రూ.54,25,407లు ఆదాయం లభించగా, ఈ ఏడాది రూ.500లు టిక్కెట్ రద్దుతో పాటు వీఐపీలు, వీవీఐపీలకు ఉచిత దర్శనాలు కావటంతో గణనీయంగా గత ఏడాది కంటే ఈ ఏడాది మూడవ రోజు ఆదాయం భారీగా తగ్గింది.

దుర్గమ్మకు శ్రీశైలం, అన్నవరం నుంచి పట్టు వస్త్రాలు



కాత్యాయనీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న శ్రీశైలం, అన్నవరం దేవస్థానాల ఈవోలు

ఇంద్రకీలాద్రి : దసరా నవరాత్రుల్లో నాల్గవ రోజు గురువారం కాత్యాయనీదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారికి శ్రీశైలం, అన్నవరం దేవస్థానాల నుంచి పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీశైలం శ్రీభమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థాన ఈవో శ్రీనివాస్ వేదపండితులతో కలిసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అన్నవరం దేవస్థానం తరపున ఈవో వి.సుబ్బారావు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వారికి దుర్గగుడి ఈవో శీనానాయక్ అమ్మవారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.





భవానీ ఘాట్‌లో శ్రమదానం చేస్తున్న వీఎంసీ అధికారులు, ఉద్యోగులు

భవానీఘాట్‌లో స్వచ్ఛతా హి సేవ..

వన్‌టౌన్ : నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు గురువారం భవానీఘాట్‌లో స్వచ్ఛోత్సవ-స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డి.చంద్రశేఖర్ నిర్వహించారు. భారత ప్రధాని మోదీ పిలుపు మేరకు విజయవాడలో నగర పౌరులు అధికారులు సిబ్బంది సుమారు 200 మంది భవానీఘాట్‌లో స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్నారు. చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ బాబుశ్రీనివాసన్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, కేబీఎన్ కాలేజీ ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

స్త్రీ శక్తి పథకం ఎఫెక్ట్.. పెరిగిన మహిళా భక్తులు

సత్యనారాయణపురం : ఈసారి దసరా ఉత్సవాలలో స్త్రీ శక్తి పథకం ఎఫెక్ట్ కనిపించింది. మహిళా భక్తులు పెరగడంతో, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో జిల్లా అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. భక్తులకు మంచినీరు, పాలు వైద్య సహాయం, లడ్డూ విక్రయ కేంద్రాలు, అన్నప్రసాద స్వీకరణ కేంద్రలను పరిశీలించి సంబంధిత అధికారులను ఆదేశిస్తున్నారు.

ఘాట్ల వద్ద నిరంతర నిఘా



పాత రాజరాజేశ్వరి పేట : దసరా ఉత్సవాల్లో భాగంగా పోలీసు అధికారులు ఇంద్రకీలాద్రి వద్ద నిరంతరం నిఘా ఏర్పాట్లు చేశారు. శనైశ్చరస్వామిగుడి,ఘాట్లు తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. అనుమానిత లగేజీలను తనిఖీ చేసి భక్తులను పంపిస్తున్నారు.

భక్తుల సేవలో..



ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలకు వస్తున్న భక్తులకు త్రిశూల గుర్తు, నామాల బొట్లను పెడుతున్నారు. బొట్టు పెట్టినందుకు భక్తులు నగదు ఇస్తే తీసుకుంటున్నారు.



పాయకాపురం : కనకదుర్గానగర్ ప్రసాదాల కౌంటర్ వద్ద పోలీసులు బారికేడ్లు పెట్టి ఆలయ అధికారుల వాహనాలను అడ్డుకున్నారు. దీంతో గుడి సిబ్బందికి, పోలీసులకు మధ్య వాగ్వివాదం జరిగిన తర్వాత ఐడీ, పాస్‌లను చూసి వాహనాలను అనుమతించారు.



కుమ్మరిపాలెం సెంటర్ వద్ద విధులకు వస్తున్న ఉద్యోగుల అడ్డగింత



దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక ఆకర్షణగా కళాకారుల ప్రదర్శనలు

పాస్‌లున్నా అడ్డుకుంటున్నారు!

» పోలీసుల తీరుపై ఉత్సవ సేవా కమిటీ సభ్యురాలి నిరసన



కొండపై పోలీసుల తీరుకు నిరసన వ్యక్తం చేస్తున్న దసరా ఉత్సవ సేవా కమిటీ సభ్యురాలు

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దుర్గగుడి దసరా ఉత్సవాలలో పోలీసు అధికారుల అత్యుత్సాహం విమర్శలకు దారితీస్తోంది. పోలీసులు తమవారిని పదుల సంఖ్యలో కొండపైకి తరలించి అమ్మవారి దర్శనం చేయిస్తున్నారని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. సామాన్య భక్తులు గంటలతరబడి అమ్మవారి దర్శనం కోసం వేచి చూస్తున్నా. ప్రధాన గేట్ల వద్ద ఉన్న పోలీసులు తమ వారిని ఎలాంటి ఆంక్షలు లేకుండా స్వాగతం పలుకుతూ, విధుల్లోకి వెళ్లే దుర్గగుడి ఉద్యోగులు, అర్చకులు, ఇతర విభాగాల వారిని అడ్డుకుంటున్నారన్నారు. పోలీసుల తీరుకు నిరసిస్తూ దసరా ఉత్సవ సేవా కమిటీ సభ్యురాలు కొండపై నిరసన వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. టోల్‌గేట్ నుంచి పోలీసు వాహనాలు బారులుతీరుతున్నా ఎలాంటి ఆంక్షలు విధించకుండా కొండపైకి పంపిస్తున్నారు. కుమ్మరిపాలెం సెంటర్ వద్ద విధులకు హాజరయ్యే ఉద్యోగుల వద్ద పాస్‌లు ఉన్నప్పటికీ గంటల తరబడి నిలబెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కొందరు పోలీసు అధికారులు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తూ భక్తులు, సిబ్బందిపైన తమ ప్రతాపాన్ని చూపిస్తున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫీడ్ బ్యాక్ ద్వారా భక్తుల సమస్యలు తక్షణమే పరిష్కరిస్తున్నాం



» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

ఇంద్రకీలాద్రి : దసరా ఉత్సవాలలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు తెలిపిన ఫీడ్ బ్యాక్ ద్వారా సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. గురువారం దుర్గగుడి ఈవోతో కలిసి ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడారు. కాత్యాయనీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇవ్వటం పది సంవత్సరాలలో ఇదే మొదటిసారని తెలిపారు. కాత్యాయనీదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవటానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారని, అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టామన్నారు. భక్తులు నుంచి క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్ బ్యాక్ తెలుసుకుంటున్నామని, వారు తెలిపిన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నామని తెలిపారు. అన్న ప్రసాదం కేంద్రంలో మరుగుదొడ్లు తగినన్ని లేవని తెలపగా వెంటనే మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. సామాన్య భక్తులకే ప్రథమ ప్రాధాన్యత అని వారికి చక్కటి దర్శన అనుభూతి కలిగించేందుకు వీఐపీ దర్శన వేళల్లో మార్పులు చేశామని చెప్పారు. వీఐపీలు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.



మోడల్ గెస్ట్ హౌస్ నుంచి దసరా ఏర్పాట్లు వీక్షించిన డీజీపీ

విజయవాడ : మోడల్ గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా గురువారం సాయంత్రం పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన వీడియోవాల్స్‌ను ద్వారా ఇంద్రకీలాద్రి, అంతరాలయం ద్వారం, ఓం మలుపు, వీఐపీ క్యూలైన్, సాధారణ భక్తుల క్యూలైను, ఫ్లైఓవర్‌పై ట్రాఫిక్ వంటి అంశాలను పరిశీలించారు. సీపీ రాజశేఖరబాబు టెక్నాలజీ ద్వారా విజయవాడ నగరం, ఇంద్రకీలాద్రిపై పెట్టిన నిఘా, చేసిన కట్టుదిట్టమైన ఏర్పాట్లను వివరించారు.



కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో దసరా ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా



మాట్లాడుతున్న ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

సీసీఎస్ ఆఫీసును తరలించొద్దు

» ఆర్టీసీ ఈయూ నేతల డిమాండ్

బస్టేషన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ హౌస్ నుంచి సీసీఎస్ ఆఫీసును తరలించే ప్రయత్నాన్ని విరమించాలని ఎంప్లాయిస్ యూనియన్ నేతలు పేర్కొన్నారు. గురువారం విజయవాడలో యూనియన్ సీసీఎస్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ, ఇప్పటికే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. యూనియన్ సభ్యులు ఎక్కువగా ఉన్నారన్న కారణంగా రాష్ట్రంలో ఉన్న నాలుగు నాన్ ఆపరేషన్ రీజియన్‌లలో ఉన్న 13 మంది డెలిగేట్ల సంఖ్యను నాలుగుకు కుదించాలన్న ప్రతిపాదనలను వెనక్కు తీసుకోవాలన్నారు. టీడీపీ హయాంలోనే అప్పట్లో ఆర్టీసీ హౌస్‌ను నిర్మించారని తెలిపారు. ఉద్యోగుల ఆర్థిక అవసరాల కోసం క్రెడిట్ కోపరేటివ్ సొసైటీని (సీసీఎస్) ఆఫీసును ఏర్పాటు చేశారని, సొసైటీకి పది రూపాయల అద్దెగాని, ఎటువంటి రుసుములు వసూలు చేయకుండానే అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. 2016లో పాలక మండలిగా ఉన్న ఎంప్లాయిస్ యూనియన్ విజ్ఞప్తిమేరకు సీసీఎస్ ఆఫీసును ఆర్టీసీ హౌస్‌లోనే ఏర్పాటు చేసుకునేందుకు అనుమతించారన్నారు. అయితే ప్రస్తుత ఎండీ ఎటువంటి డిమాండ్ చేయకుండానే నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో గత నాలుగేళ్ల క్రితం ఏర్పడిన సీసీఎస్ పాలక మండలి సభ్యుల సౌకర్యాల కోసం ఆర్టీసీ హౌస్‌కు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఓ అపార్టుమెంట్‌లోకి తరలించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇలా తరలిస్తే వేల మంది ఎన్నో ఇబ్బందులకు గురవుతారన్నారు. ఆర్టీసీ హౌస్‌లోనే సీసీఎస్ కార్యాలయం ఉండేలా పాలకమండలి నిర్ణయం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధంగా ఉండాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీసీఎస్ వైస్ చైర్మన్ జి.నాగేంద్ర ప్రసాద్, రాష్ట్ర నాయకులు సి.నబీరసూల్, ఎస్.కె.మొహిద్దీన్, చక్రవర్తి, ఎస్.పి.బాబు, జి.ఎస్.నారాయణ, జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు, సీసీఎస్ మాజీ ఎంసీ మెంబర్లు, డెలిగేట్లు పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ దరఖాస్తుకు గడువు పెంపు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9, 11 తరగతుల్లో లేటరల్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ డి.ఏదునందన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు లేటరల్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు తేదీని అక్టోబర్ 7 వరకూ పొడిగించినట్టు తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 8, 10 తరగతులు చదివి ఉండాలన్నారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో జేఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ వివరించారు.

అమ్మసేవలో.. అలమటిస్తున్నాం!

» ఇంద్రకీలాద్రి పరిసరాలను శుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర
» రాత్రింబవళ్లు కష్టపడినా పట్టించుకోని అధికారులు
» కనీస భోజన సదుపాయాలు లేవు
» పారిశుధ్య కార్మికుల ఆవేదన



ఎండలోనే సీతమ్మవారి పాదాల ఘాట్ ఎదురుగా అండర్ పాస్ వద్ద పారిశుధ్య కార్మికులు

విజయవాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా ఆ ప్రాంతం అందంగా ఉండాలంటే పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకం. పరిసరాలు అందంగా ఉంటేనే ప్రభుత్వానికి, అధికారులకు మంచిపేరు వస్తుంది. పరిశుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పారిశుధ్య కార్మికులదే. దసరా మహోత్సవాలను నగర ప్రజలు ఘనంగా జరుపుకుంటారు. ఈ మహోత్సవాల సమయంలో ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకోవడానికి రోజూ వేలల్లో భక్తులు తరలివస్తుంటారు. అయితే పారిశుధ్య కార్మికులు కొండపైనా.. పరిసరప్రాంతాలు, రోడ్డుపై చెత్త పడిన యుద్ధం ప్రకటించినట్టు వెంటనే శుభ్రం చేసి అందంగా ఉంచుతున్నారు. అటువంటి తమను కనీసం భోజనం చేశావా అని పట్టించుకునే నాథుడే లేడని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి నుంచి భోజనాలు, అన్న ప్రసాదమే గతి

దసరా ఉత్సవాలు ఎంత ఘనంగా జరిగాయని చెప్పుకోవడానికి భక్తులకు అందించే వసతులు ఒక ఎత్తయితే.. ఇంద్రకీలాద్రి పరిసర ప్రాంతాలు ఎంత పరిశుభ్రంగా ఉంటే అంత అద్భుతంగా జరిగినట్టు చెప్పుకుంటారు భక్తులు. అయితే పారిశుధ్య కార్మికులను అధిక సంఖ్యలో నియమించి ఎక్కడికక్కడ క్లీన్‌గా ఉంచే విధంగా అధికారులు చర్యలయితే చేపట్టారు కానీ వారి ఆకలి గురించి పట్టించుకునే విషయంలో మాత్రం ఆదమరిచారు. దీంతో ఉదయం టిఫిన్ నుంచి సాయంత్రం భోజనాల వరకు వారు ఇంటి నుంచి కొందరు తెచ్చుకుంటే.. మరికొందరు భక్తులకు ఏర్పాటు చేసిన అన్నప్రసాదానికి వెళ్లి తింటున్నారు. దసరా ఉత్సవాల్లో పాల్గొనే అన్నిశాఖల ఉద్యోగులు, కార్మికులకు మాత్రం జిల్లా యంత్రాంగం లేదా ఆయాశాఖల అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు భోజన ఏర్పాట్లతో పాటు టీ, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నారు. కానీ పారిశుధ్య కార్మికులను నియమించిన మున్సిపల్ అధికారులు, వారిని తీసుకువచ్చిన కాంట్రాక్టర్లు మాత్రం అసలు పట్టించుకోవడం లేదని ఆ చిరు కార్మికులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. తమను ఉన్నత స్థాయి ఉద్యోగుల్లా కాకపోయినా కనీసం మనుషుల్లా చూడాలని వారి ఆవేదన బాధాకరం.

ఏమైనా తిన్నావా అని అడిగేవారు లేరు

- భవాని కుమారి పారిశుధ్య కార్మికురాలు

మూడు షిఫ్టుల్లో పనిచేసే తమను ఎంతసేపు పనిచేశావా, అక్కడికి వెళ్లండి.. చెత్త పేరుకుపోయింది.. శుభ్రం చేయండి.. అనేవారే తప్ప భోజనానికి టైం అయింది తిన్నావా..! అనేవారు ఒక్కరూ లేరు. కనీసం టీ ఇచ్చే నాథుడే లేడు. మొదటిరోజు అందరిలాగే మాకు ప్రత్యేకంగా భోజన ఏర్పాట్లు చేస్తారేమో అనుకున్నాం. కానీ ఎప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడంతో ఐదు, పది మంది చొప్పున భక్తులకు పెట్టే అన్నప్రసాదం వద్దకు వెళ్లి తినివస్తున్నాం. ఇప్పుడు ఇంటివద్ద నుంచే భోజనం తెచ్చుకుంటున్నాం.

మమ్మల్ని మనుషుల్లా గుర్తించాలి

- లక్ష్మి, పారిశుధ్య కార్మికురాలు

భక్తులు వేసిన చెత్తను తీయడంలో పొరపాటు రెండు నిమిషాలు ఆలస్యమైతే మాపై సర్రున ఎగిరే అధికారులు, కాంట్రాక్టర్లు భోజనం చేయడం ఆలస్యమైనా కనీసం పట్టించుకోరు. అందరి కార్మికుల్లా మమ్మల్ని చూడనవసరం లేదు. కనీసం మనుషులుగా అయినా గుర్తిస్తే చాలు. ఎంత చిన్నస్థాయి కార్మికులమైనా మరీ కనీసం పట్టించుకోకపోవడం బాధగా ఉంది.

తీవ్ర జాప్యం!

(5వ పేజీ తరువాయి)

అధికారులు చెప్పి వారిని పంపేశారు. జిల్లాలో వీఏఏలు లేని గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదు చేయడంలో ఆలస్యమవుతోంది.

అన్నింటికీ ఆధారం

ఈ-క్రాప్‌లో రైతులు సాగు చేస్తున్న పంట వివరాలను నమోదు చేస్తేనే రానున్న రోజుల్లో ధాన్యం కొనుగోలు చేస్తారు. రైతు భరోసా నగదు విడుదల, ప్రకృతి విపత్తులు సంభవించి రైతులు పంటను కోల్పోతే నష్టపరిహారం, పంట బీమా పొందేందుకు దరఖాస్తు చేసుకునే సమయంలోనూ ఈ-క్రాప్‌లో నమోదైన వివరాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఈ-క్రాప్‌లో పంట వివరాలు నమోదు చేయాలంటే వీఏఏలు, వీఆర్వోలు ఖచ్చితంగా పొలం వద్దకు వెళ్లాలనే నిబంధనను ప్రభుత్వం విధించింది. కొన్ని గ్రామాల్లో వీఏఏలు లేరనే కారణంతో ఇన్‌చార్జి వీఏఏలను నియమించి ఈ-క్రాప్ నమోదును ఆలస్యంగా ప్రారంభించారు. భూమి సాగు చేస్తున్న వారి పేరు, భూమి సర్వే నెంబరు, రైతు బ్యాంకు ఖాతా నెంబరు, ఆధార్ కార్డు నెంబరును ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేయాలి. ఈ-క్రాప్ నమోదులో ఆలస్యం జరుగుతుండటంతో పాత జాబితాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మోపిదేవి మండలంలో ఈ-క్రాప్ నమోదు ఆలస్యం అవుతుండటంతో ఈ-క్రాప్ నమోదును వందశాతం ఖచ్చితత్వంతో పూర్తిచేసి, భవిష్యత్తులో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతూ మండల పరిధిలోని రైస్ మిల్లు యజమానులు ఇటీవల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయడం గమనార్హం. ఈ వివరాల ఆధారంగానే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తారు.

కౌలు రైతుల సంగతేంటి?

భూమి యజమాని తన పొలాన్ని కౌలుకు ఇస్తే భూమిని సాగుచేసే కౌలు రైతుల పేరుతో ఈ-క్రాప్‌లో వివరాలు నమోదు చేయాలనే నిబంధన ఉంది. కానీ ఈ నిబంధనను పాటించడం లేదని కౌలు రైతులు అంటున్నారు. జిల్లాలో కౌలురైతు గుర్తింపు కార్డులను 57 వేల మందికి మాత్రమే ఇచ్చారు. ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో గుర్తింపు కార్డులు ఉన్న కౌలు రైతులు పంటను నష్టపోతే వారి పేరున పంట నష్టపరిహారం విడుదల కాని పరిస్థితి నెలకొంది. కౌలు రైతులకు పంట నష్టపరిహారం ఇచ్చే విషయంపై అధికారుల మధ్య పలుమార్లు చర్చలు జరిగినా, స్పష్టమైన నిర్ణయం తీసుకోలేని స్థితిలో అధికారులు ఉన్నారు.

వరద ఉధృతి

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు నీటిలో మునిగాయి.

అక్విడెక్ట్ వద్ద పెరుగుతున్న నీటిమట్టం

పులిగడ్డ అక్విడెక్ట్ వద్ద వరద నీటి మట్టం 16 అడుగులకు చేరింది. అక్విడెక్టుకు సమాంతరంగా నీటి ప్రవాహం కొనసాగుతోంది. మరో మూడు రోజుల పాటు నీటి ప్రవాహం ఇలాగే ఉంటుందని ఇరిగేషన్ డీఈ గణపతి తెలిపారు. నదీతీర ప్రాంతాల ప్రజలు భయపడవాల్సిన అవసరం లేదన్నారు.

చక్కనితల్లికి చాంగుభళా

(5వ పేజీ తరువాయి)

కూచిపూడి కళాకారిణులు, విద్యార్థినులు నర్తించారు. నవదుర్గల స్వరూపాల్లో తొమ్మిది మంది కళాకారిణులు ఆయుధాలతో 'జయజయహే మహిషాసురమర్దిని' అంటూ సభా మధ్యలోకి ప్రవేశించి అందరినీ ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకెళ్లారు. కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తనలు.. కళాకారులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్.. ఇటలీ తెలుగు అసోసియేషన్ గుర్తింపు సర్టిఫికెట్లు అందించారు.

ఘంటసాల సంగీత కళాశాలలో..

సత్యనారాయణపురంలోని ఘంటసాల సంగీత కళాశాల గురువారం జరిగిన కార్యక్రమాల్లో చింతా రవిబాలకృష్ణ బృందం ప్రదర్శించిన మహిషాసురమర్దిని రూపకం, మోహినీ భస్మాసుర యక్షగానం ఆసక్తిగా సాగాయి. రామాయణ ఇతివృత్తాన్ని తీసుకుని కాకినాడకు చెందిన అనపర్తి లోవరాజు 30 నిమిషాల పాటు తోలుబొమ్మలాట ప్రదర్శించారు. రామాంజనేయ యుద్ధం పౌరాణిక పద్య నాటకాన్ని రక్తికట్టించారు. ప్రవీణ్ గాత్ర కచేరీ, ఓం సాయిలక్ష్మి, తమ్మిన సాహిత్యప్రియ సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకున్నాయి. సంపత్‌నగర్‌కు చెందిన శ్రీబాలసరస్వతి నాట్యమండలి రాజమహేంద్రవరం వారి 'శ్రీరామాంజనేయ యుద్ధం' నాటక ప్రదర్శన కనులపండువగా సాగింది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	117, 125, 136
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం

విజయవాడ రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చి, రాష్ట్ర వ్యాప్తంగా 34 లక్షల మంది మహిళలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్య ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. స్వస్థ్ నారీ సశక్తి వైద్య శిబిరం నున్న గ్రామంలో గురువారం జరిగింది. మంత్రి సత్యకుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అక్టోబరు 2వ తేదీ వరకు మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరాలను మహిళలు, బాలికలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్



సాయిరాంను సత్కరిస్తున్న అధ్యాపకులు

ఉపాధిలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలకం

● కళాశాల ప్రొఫెసర్ పీవీఎస్ సాయిరాం

కానూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉపాధికి ఎంతగానో దోహదపడుతుందని ఆంధ్రా లయోలా కళాశాల భౌతికశాస్త్ర విభాగం ప్రొఫెసర్ పీవీఎస్ సాయిరాం తెలిపారు. సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యం లో గురువారం ఎలక్ట్రానిక్ పరికరాల ఆవశ్యకత అంశంపై జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సాయిరాం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏఐ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ తదితర వాటిలో భౌతికశాస్త్రం ప్రాధాన్యతను వివరించారు. వర్సిటీ భౌతికశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కొల్లా నరేంద్రలు పాల్గొన్నారు.

పెనమలూరు

ఐద్వా అధ్యక్షురాలిగా షేక్ వలీబీ

పెనమలూరు : పెనమలూరు మండల ఐద్వా అధ్యక్షురాలిగా షేక్ వలీబీ ఎన్నికయ్యారు. యనమలకుదురులో జరిగిన కార్యక్రమంలో ఐద్వా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా పాతాళ లక్ష్మిని, మరో తొమ్మిది మందితో కమిటీని ఎన్నుకొన్నట్లు ఐద్వా ప్రతి నిధులు తెలిపారు.



గన్నవరంలో..



కంకిపాడులో..



ఉమామహేశ్వరపురంలో..



ఉయ్యూరులో..

కాత్యాయనీదేవిగా దుర్గమ్మ

గన్నవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. పాత గన్నవరం లక్ష్మీ తిరుపతమ్మ ఆలయంలో గురువారం అమ్మవారు కాత్యాయని దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. చిట్నేని వెంకట్రావు, కళ్యాణి, పెడసనగంటి సురేంద్ర కుమార్, రామేశ్వరీ దంపతులు పూజలు జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్థానిక గాయత్రి మందిరం, కన్యక పరమేశ్వరీ ఆలయం, యాదవుల రామాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు జరుగుతున్నాయి. **కంకిపాడు :** ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీమణి బోడె హేమ కోరారు. కంకిపాడులోని గంగా, పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం కాత్యాయనిగా భక్తులకు దర్శనమిచ్చారు. బోడె హేమ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నసమారాధనలో ఆమె పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్ :** లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో రాజరాజేశ్వరి దేవిని గజలక్ష్మిగా అలంకరించారు. కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండపం, బాపులపాడు భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో అమ్మవారిని కాత్యాయనిదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. శివాలయంలో బాపులపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి బీఎస్. పూర్ణేశ్వరి, ఈవోపీఆర్డీ లక్ష్మయ్య, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. **హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** ఉమామహేశ్వరపురంలోని రామాలయంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ఏఎంసీ డైరెక్టర్ అర్నేపల్లి రామలక్ష్మి, అర్నేపల్లి సూరిబాబు ప్రత్యేక పూజ నిర్వహించారు. పాండురంగారావు, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. మల్లవల్లిలో శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అక్కినేని చైతన్య, శ్వేత దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. రంగన్నగూడెం కమిటీ ఆధ్వర్యంలో, కొత్తపల్లి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. బండారుగూడెంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో గురువారం భవానీ మాలధారులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కమిటీ చైర్మన్ సత్రం అప్పారావు పర్యవేక్షణలో అర్చకుడు గోపిశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొర్రా ధనలక్ష్మి, ముక్కు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **ఉయ్యూరు :** జగదాంబ ఆలయంలో కాత్యాయనీ దేవిగా అమ్మవారు పూజలందుకున్నారు. గండిగుంట వంశీ రాయల్ సిటీలో జరుగుతున్న వేడుకల్లో నూకల సాంబశివరావు దంపతులు పాల్గొని పూజలు చేశారు. కాటూరు, రాజుపేట తదితర గ్రామాల్లో దసరా ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

● ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పిలుపు

పెనమలూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. పోరంకి, గంగూరు గ్రామాల్లో జరిగిన స్వచ్ఛతాహి కార్యక్రమంలో అధికారులతో కలిసి పర్యటించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశుధ్య కార్మికులతో కలిసి రోడ్లను శుభ్రం చేశారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరగడంవల్ల దోమలు, క్రిమికీటకాలు పెచ్చరిల్లి ప్రజలకు విషరోగాలు ప్రబలుతున్నాయని, స్థల యజమానులు స్వచ్ఛందంగా స్థలాలను శుభ్రం చేసి సహకరించాలని కోరారు. ఎంపీడీవో బండి ప్రణవి, టీడీపీ కూటమి నేతలు పాల్గొన్నారు.

కంకిపాడు : ఈడుపుగల్లు గ్రామంలో



స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రలో పాల్గొన్న సర్పంచ్ పందిపాటి ఇందిర తదితరులు



రోడ్డును శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఇందిర పాల్గొన్నారు. చీపుర్లు పట్టి ప్రధాన రహదారులను శుభ్రం చేశారు. ఈవో చింతా కిరణ్‌కుమార్, పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఏపీ మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్ దయాల రాజేశ్వరరావు అన్నారు. బాపులపాడు గ్రామంలోని శ్మశాన వాటిక వద్ద స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. టీడీపీ జంక్షన్ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి మొవ్వా వేణుగోపాల్, ఎంపీడీవో జోగేశ్వరరావు,ఈవో బీఎస్. పూర్ణేశ్వరి,వార్డు సభ్యులు నాగరాజు. తాడిశెట్టి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

ఎదుగుదలలో వ్యక్తిత్వమే ప్రధానం

కానూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఎదుగుదలలో వ్యక్తిత్వమే ప్రధానమి కాటర్ పిల్లర్ ఇండియా ఇంజనీరింగ్ సర్వీసెస్ సంస్థ ఐటీ డైరెక్టర్ చలసాని ప్రసాద్ అన్నారు. పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో గురువారం బిల్డ్ యువర్ బ్రాండ్, స్టోరీ టెల్లింగ్ అండ్ ఎగ్జిక్యూటివ్ ప్రెజెన్స్ అంశంపై జరిగిన కార్యక్రమంలో చలసాని ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, విభాగాధిపతి డాక్టర్ పి. ఆదిలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు.

జన సురక్ష పథకాలపై అవగాహన

ప్రసాదంపాడు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలోని అర్హత కలిగిన ప్రతి పౌరుడు జన సురక్ష పథకాల వల్ల లబ్ధి పొందాలని డీఎఫ్ఎస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చంద్రదీప్ కుమార్ ఝా కోరారు. గురువారం ఈఎస్ఐ హాస్పిటల్ రోడ్డులోని రోటరీ క్లబ్ భవనంలో రామవరప్పాడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జన సురక్ష అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటల్ పెన్షన్ యోజన, పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎంజేడీవై పథకాల ప్రయోజనాలను వివరించారు. ఈ పథకం అక్టోబరు నెలఖరు వరకు ఉంటుందని దగ్గర్లోని యూనియన్ బ్యాంకుకు వెళ్లి ఖాతాలు తెరవాలని కోరారు. ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ సీవీఎన్ భాస్కర్ రావు, యూనియన్ బ్యాంక్ విజయవాడ రీజినల్ హెడ్ ఎంవీ తిలక్, కెనరా బ్యాంకు జీఎం సీజే. విజయలక్ష్మి, ఆర్‌బీఐ డీజీఎం కృష్ణ కుమార్, నాబార్డ్ డీజీఎం రాజు కుమార్ శర్మ, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్ఎస్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చంద్రదీప్ కుమార్ ఝా

వెనుకబడిన వారి అభ్యున్నతికి దీనదయాళ్ కృషి

ప్రసాదంపాడు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో వెనుకబడిన వారి అభ్యున్నతి కోసం పండిట్ దీన్‌దయాళ్ కృషి చేశారని విజయవాడ సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.రమేష్ చంద్ర అన్నారు. ఎనికేపాడులోని విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఫర్ ఉమెన్‌లో పండిట్ దీన్‌దయాళ్ జయంతి సందర్భంగా అంత్యోదయ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రమేష్ చంద్ర ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అంత్యోదయ మిషన్ లక్ష్యాలను విద్యార్థులకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సామాజిక సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఫార్మాస్యూటికల్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఫార్మాస్యూటికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ డా.కె.పద్మలత విద్యార్థులు సామాజిక బాధ్యతతో కూడిన పౌరులుగా ఎదగాలని సూచించారు. ప్రోగ్రాం ఆఫీసర్ ఏ.జయరామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



పండిట్ దీన దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న క్టర్ ఆర్.రమేష్ చంద్ర

CHANGE OF NAME

I, Uppala Suresh (Old Name), S/o. Sambasiva Rao, resident of H.No. 4-100, Vaikuntapuram, Gosala Village, Penamaluru Mandal, have changed my name as Uppala Suresh Babu (New Name), S/o. Sambasiva Rao. Hereafter, my name shall be known as Uppala Suresh Babu (New Name), S/o. Sambasiva Rao.



విద్యార్థిని అభినందిస్తున్న శివాజీబాబు

ఎన్‌సీసీ క్యాంప్‌లో పీవీపీ విద్యార్థుల ప్రతిభ

కానూరు, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) : ఆలిండియా థల్ సైనిక్ ఎన్‌సీసీ శిబిరంలో కానూరులోని పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కళాశాల విద్యార్థి సార్జెంట్ బి.లిఖిత్, జూనియర్ అండర్ ఆఫీసర్ బి.రాజ్‌దీప్ జాతీయ స్థాయిలో తమ తమ విభాగాల్లో ప్రతిభను కనబరిచి రజిత పతకాలు సాధించారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు ప్రతిభ కనపరిచిన క్యాడెట్లు లిఖిత్, రాజ్‌దీప్, కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ విజయంత శ్రీవాస్తవ, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ ఎం.ధదూర్య నాయక్‌లను అభినందించారు.

ఉత్సాహభరితంగా కల్చరల్ ఫెస్ట్

ఉయ్యూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : శ్రీశ్రీనివాస గ్రావిటీ కళాశాలలో గురువారం కల్చరల్ ఫెస్ట్ ఉల్లాసభరితంగా జరిగింది. ముఖ్య అతిధిగాగన్నవరం సీఐ శివప్రసాద్ పాల్గొని సందేశమిచ్చారు. లక్ష్య సాధనకు ఏకాగ్రత, నిబద్ధత అవసరమన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. విద్యార్థులు ప్రదర్శించిన డ్యాన్స్‌లు ఉత్సాహ భరితంగా సాగాయి. విద్యాసంస్థల అధినేతలు పరుచూరి శ్రీనివాసరావు, నీలిమ, ఏవో సురేశ్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఏకయ్య, రవి, అధ్యాపకులు, పాల్గొన్నారు.



కల్చరల్‌ఫెస్ట్‌లో డ్యాన్స్‌లు చేస్తున్న విద్యార్థినులు



వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న కుమారస్వామి

సేవా భావంతో వృద్ధులను ఆదరించాలి

గన్నవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సేవా భావంతో వృద్ధులను ఆదరించాలని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి అన్నారు. రీచ్ ప్రాంగణంలో బీకేఆర్ వృద్ధాశ్రమం మూడో బ్రాంచ్‌ని గురువారం ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మట్టా, బీకేఆర్ వృద్ధాశ్రమం చైర్మన్ కానూరు శేషమాదవి, కార్యదర్శి సత్యవేద కుమార్, శ్రీనాథ్, మోహన్, నీలం అశోక్, వెంకటేశ్వర్‌రెడ్డి, పోలవరపు అనిల్, బొకినాల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం తప్పదు

గన్నవరం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కళ్లం వెంకటేశ్వరరావు అన్నారు. 13 గంటల పనిపై అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. అనుమోలు వెంకటేశ్వరరావు, మల్లంపల్లి ఆంజనేయులు, క్రైలే ఏసుదాసు, మిరప నాగేశ్వరరావు, ఉదయ భాస్కర్, రాంబాబు, నూతక్కి రామ్మోహనం, సిహెచ్ వెంకటేశ్వరరావు, సిహెచ్ భవాని ప్రసాద్, ఎం విజయరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె

ప్రణాళికాబద్ధంగా తాడిగడప అభివృద్ధి

పెనమలూరు : ప్రణాళికాబద్ధంగా తాడిగడపను అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. పోరంకిలో రూ.30లక్షలవ్యయంతో నిర్మించ తలపెట్టిన వినాయక గుడి సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు శంకుస్థాపన చేశారు. టీడీపీ కూటమి నాయకులు అనుమోలు ప్రభాకర రావు, చెన్నుపాటి శ్రీనివాస్, సంగెపు రంగారావు, కొండా ప్రవీణ్ పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : సకాలంలో సస్యరక్షణ చర్యలతో యాజమాన్య పద్ధతులు పాటిస్తేనే వరిలో అధిక దిగుబడి సాధించవచ్చని ఏవో బి. రంగనాథ్‌బాబు రైతులకు సూచించారు. కాకులపాడులో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని క్షేత్ర స్థాయిలో పంటను పరిశీలించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి తక్కువ ఖర్చుతో నానో యూరియా లాంటివి వాడాలని సూచించారు. ప్రతి రైతు ఈక్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. చలసాని శ్రీనివాస్, కామినేని శ్రీహరిరావు, చెక్కా లక్ష్మయ్య, మల్లంపాటి రామయ్య, కాలి చింతాలు, వీరపనేని రాజేశ్వరరావు, కొల్లి రాజగోపాల్, మహ్మద్ జలాల్, రైతులు, పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్‌లో 22 మందికి ఉద్యోగాలు

ఉయ్యూరు : ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల ఉపాధి శిక్షణ విభాగం, దివీస్ లేబరేరీస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్‌లో 22 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ తెలిపారు. దివీస్ లేబరేటరీస్ హెచ్‌ఆర్ హరికృష్ణ, జూనియర్ హెచ్‌ఆర్ శ్రీహరి విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 52 మంది విద్యార్థులు హాజరు కాగా 22 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు ఉపాధి శిక్షణ అధికారి సీహెచ్ అనిల్ కుమార్, రసాయనశాస్త్ర శాఖాధిపతి కిషోర్ తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ అభినందించారు.

భగవద్గీత, గంట బహూకరణ

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) : అభయాంజనేయ స్వామి దేవస్థానానికి శ్రీరామ ఉత్సవ కమిటీ భగవద్గీతతో పాటు గంటను గురువారం రాత్రి బహూకరించారు. శ్రీరామ ఉత్సవ కమిటీ తరఫున గంటను అందజేస్తున్నట్లు కమిటీ నేతలు తవ్వా పూర్ణచంద్రరావు, నూకల జాలాజీ, నూకల రాఘవరావు, అంకమ్మబాబు, వడ్డి విజయ్, సత్యమణి తెలిపారు. సమయంతో పాటు భగవద్గీత శ్లోకాలను తాత్పర్యంతో వినిపిస్తుందని తెలిపారు.



ముద్దాడ రవిచంద్ర దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్, ఈవో శీనానాయక్

దుర్గమ్మ సన్నిధిలో సీఎం కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్ర

ఇంద్రకీలాద్రి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో భాగంగా గురువారం కాత్యాయనీ దేవి అలంకారంలో దర్శనమిచ్చిన కనకదుర్గమ్మను ముఖ్యమంత్రి కార్యాలయ ప్రిన్సిపల్ సెక్రటరీ ముద్దాడ రవిచంద్ర సతీసమేతంగా దర్శించుకున్నారు. దేవదాయ శాఖ కమిషనర్ కే రామచంద్ర మోహన్, దుర్గగుడి ఈవో శీనానాయక్, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వేద ఆశీస్సులందజేశారు. కే రామచంద్రమోహన్, ఈవో వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

రాజధాని రైతుల ప్లాట్లకు నేడు ఈ-లాటరీ

కలెక్టరేట్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా రాజధాని అమరావతి నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) పరిధిలో భూ సమీకరణ పథకంలో భూములను సీఆర్‌డీఏకి అప్పగించిన పెనుమాక (జరీబు, మెట్ట), మల్కాపురం (ప్రత్యామ్నాయ ప్లాట్లు) గ్రామ రైతులకు రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించేందుకు 26న శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి విజయవాడ లెనిన్ సెంటర్‌లోని సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఈ-లాటరీ జరుగుతుంది. 56 మంది రైతులకు 104 ప్లాట్లను ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా కేటాయిస్తారు. వీటిలో 43 రెసిడెన్సియల్ ప్లాట్లు కాగా 41 కమర్షియల్ ప్లాట్లు, 20 ప్రత్యామ్నాయ ప్లాట్లు. రైతులు ఈ లాటరీకి హాజరుకావాలని అధికారులు కోరారు.

రైతుల భూముల స్వాధీనం సరికాదు

● మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

గాంధీనగర్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పేరుతో రాష్ట్రవ్యాప్తంగా బడా కార్పొరేట్ సంస్థలకు రైతుల నుంచి బలవంతంగా వారి భూములను స్వాధీనం చేసుకోవడం సరైంది కాదని ఈ విధానాన్ని మానుకోవాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికారు. ఈ చర్యలపై అన్ని సంఘాలను కలుపుకుని పోరుబాట పడతామన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పంటలకు ఉపయోగపడని భూములను మాత్రమే పరిశ్రమలకు కేటాయించాలని సూచించారు. రైతు సంఘం సీనియర్ నేత వై కేశవరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు పండించిన ఏ పంటకు మద్దతు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కౌలురైతు సంఘం ప్రధానకార్యదర్శి పీ జమలయ్య మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులను అందించడంలో కూటమి ప్రభుత్వం విలమైందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 970 లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్వహణకు పీపీపీ మోడల్‌లో ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించడాన్ని తప్పుబట్టారు.



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

చర్చలకు పిలవకపోవడం దారుణం

● విద్యుత్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ కృష్ణయ్య

విజయవాడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్ యాజమాన్యం ఈ నెల 15 నుంచి దశల వారీగా ఉద్యమం చేసినప్పటికీ విద్యుత్ యాజమాన్యం చర్చలకు పిలవకపోవడం దారుణమని జేఏసీ రాష్ట్ర చైర్మన్ ఎస్ కృష్ణయ్య అన్నారు. నగరంలోని భవానీపురంలో హరితా హోటల్‌లో గురువారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 26వేల మంది కాంట్రాక్టు కార్మికులున్నారని, వారు 20ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో వెట్టిచాకిరీ చేస్తున్నారని వారిని సంస్థలో విలీనం చేయాలన్నారు.సంస్థలో చేరిన ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, 7,500 మంది జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2లను సంస్థలో విలీనం చేసి, ప్రమోషన్ కల్పించాలని కోరారు. రాష్ట్ర కన్వీనర్ ఎంవీ రాఘవరెడ్డి, కో-చైర్మన్ శేషారెడ్డి 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం గోపాలరావు, 327 యూనియన్ రాష్ట్ర సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్రా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తూర్పు కృష్ణా ఎన్జీవోల సంఘం మాజీ కార్యదర్శి

దారపు శ్రీనివాసరావు ఆకస్మిక మృతి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): తూర్పు కృష్ణా ఎన్జీవోల సంఘం మాజీ కార్యదర్శి, కృష్ణాజిల్లా పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు, జిల్లా పరిషత్ ఉద్యోగుల సంఘం పూర్వ అధ్యక్షుడు, గుడ్లవల్లేరు రిటైర్డ్ ఎండీవో దారపు శ్రీనివాసరావు బెంగళూరులో గురువారం మధ్యాహ్నం అనారోగ్యంతో కన్నుమూశారు. జై ఆంధ్ర ఉద్యమంలో దారపు శ్రీనివాసరావు ఉద్యోగులను ఉ ద్యమబాట నడిపించారు. మచిలీపట్నంలో ఎన్జీవో హోమ్ నిర్మాణానికి విశేష కృషి చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులతో సమావేశాలకు పలుమార్లు ప్రాతినిధ్యం వహించారు. మృదుస్వభావి దారపు శ్రీనివాసరావు మృతికి పలువురు అధికారులు, అనధికారులు, తూర్పుకృష్ణా ఎన్జీవోల సంఘ నేతలు ప్రగాఢ సంతా పం వ్యక్తం చేశారు. ఆయన భౌతికకాయాన్ని శుక్రవారం పరాసుపేటలోని స్వగృహానికి తీసుకువస్తారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు అంత్యక్రియలు ప్రారంభమవుతాయని సంఘ నేతలు తెలిపారు.

కేసీపీ చెరకు ధర టన్నుకు రూ.3690-50

ఉయ్యూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేసీపీ చక్కెర కర్మాగారం ప్రస్తుత సీజన్‌కు చెరకు సరఫరా చేసిన రైతులకు రూ.400 సబ్సిడీతో కలిపి టన్నుకు రూ.3,690 గా ప్రకటించింది. కర్మాగార ఆవరణలో గురువారం చెరకు రైతుల సంఘం సభ్యులతో యూనిట్ హెడ్ యలమంచిలి సీతారామదాస్ నిర్వహించిన సమావేశంలో చెరకు టన్ను ధర ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాంత్రీకరణకు అనువుగా చెరకు సాగుచేసిన రైతులకు టన్నుకు రూ.400 సబ్సిడీతో కలిపి రూ.3,790 చెల్లించనున్నామని ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేసి రైతులతో పాటు కర్మాగార అభివృద్ధి తోడ్పడాలన్నారు. 2026-2027 సీజన్‌కు సంబంధించి 2025 నవంబరు నుంచి 2026 ఫిబ్రవరి వర కు నాటే చెరకు మొక్క తోటలకు ఎకరానికి రూ.10వేలు సబ్సిడీగా ప్రకటించారు. సంప్రదాయ పద్ధతుల్లో నాటిన చెరకు తోటలకు టన్నుకు రూ.400 లేదా యాంత్రీకరణ అనువుగా వేసిన తోటలకు టన్నుకు రూ.500 సబ్సిడీ ఇస్తామన్నారు. మొక్కతోటలకు ఎకరాకు రూ.20వేలు, పిలక తోటలకు రూ. 8వేలు వడ్డీలేని రుణం ఇవ్వనున్నామని, ఎకరానికి రూ.10వేల చెరకు మొక్కలు లేదా విత్తనం వడ్డీలేని రుణంగా ఇస్తామన్నారు. రైతు సంఘం అధ్యక్షుడు ఎన్వీ కృష్ణారావు, జొన్నలగడ్డ మోహన్ రెడ్డి, వీ రత్నగిరిరావు, సీహెచ్ పూర్ణచంద్రరావు, తిమ్మారెడ్డి, పులి శ్రీనివాసరావు కేన్ జీఎం పున్నారావు, డీజీఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉత్సవ్‌లో నేటి ప్రదర్శనలు

విజయవాడ సిటీ, సెప్టెంబర్ 25 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా ఐదోరోజు శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి మొదలయ్యే కార్యక్రమాల వివరాలు ఇలా ఉన్నాయి.

పున్నమిఘాట్‌లో..

బీట్ గురూస్ లైవ్, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఉన్నాయి.

తుమ్మలపల్లి వేదికగా..

సాయంత్రం 6 గంటలకు గుంటూరుకు చెందిన ఎంబీకే మ్యూజిక్ అండ్ డ్యాన్స్ స్కూల్ స్టూడెంట్స్‌తో కూచిపూడి నృత్య ప్రదర్శన, 6.30 గంటలకు సంగీత వాద్య ప్రదర్శన, సాయంత్రం 7 గంటలకు తెనాలికి చెందిన రామ్ ప్రసాద్ కాళిక వేషాల ప్రదర్శన, 7.30 గంటలకు నర్సారావుపేటకు చెందిన వనపర్తి దుర్గారావు నేతృత్వంలో తోలుబొమ్మలాట, 8 గంటలకు పద్మశ్రీ కల్లూరి సుబ్బారావు లలిత కళాపరిషత్, అనంతపురం వారితో పౌరాణిక పద్య నాటకం శకుని జరుగుతాయి.

ఘంటసాల ప్రభుత్వ కళాశాల వేదికగా..

సాయంత్రం 6 గంటలకు నటరాజ్ డ్యాన్స్, మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ స్కూల్ స్టూడెంట్స్‌తో కూచిపూడి, భరతనాట్యం, కోలాటం, 6.30 గంటలకు జీవీఆర్ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులతో గాత్ర సంగీత ప్రదర్శన, 7 గంటలకు నగరానికి చెందిన సప్పా శివకుమార్ కూచిపూడి ప్రదర్శన, 7.30 గంటకు అమలాపురానికి చెందిన అయ్యప్ప నేతృత్వంలో గంగులు ప్రదర్శన, 8 గంటలకు కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్, గుంటూరు వారి సాంఘిక నాటిక తరమెల్లిపోతున్నదో వంటి ప్రదర్శనలు జరుగుతాయి.

దుర్గమ్మకు సాంస్కృతిక నీరాజనం

దుర్గా స్పెషల్‌గా ఉత్సవ్‌లో శ్రీశక్తి ● పున్నమిలో అయిగిరినందిని.. అలరిస్తున్న ప్రదర్శనలు ● విజయవాడ ఉత్సవ్‌లో స్పీకర్ల సందడి ● అబ్బురపరిచిన మహిళ చేనేత వస్త్రధారణ



తప్పెటగుళ్లు ఆడుతున్న కళాకారులు





వయొలిన్ వాయిద్యంతో సూట్‌కేస్ దరువు





ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: విజయవాడ ఉత్సవంలో దుర్గమ్మ స్పెషల్‌గా సాంస్కృతిక నీరాజనం జరిగింది. దుర్గమ్మను స్తుతిస్తూ నర్తించటంతో పాటు, భక్తి పాటలకు నృత్యాలతో భక్తిభావం పెంపొందించారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఇద్దరూ పున్నమిఘాట్ ఉత్సవ్‌లో సందడి చేశారు. చేనేత వస్త్రధార ప్రదర్శన, వయోలిన్ సంగీతం, తప్పెటగుళ్లు వంటివి అలరించాయి. అయిగిరినందిని.. దుర్గా స్పెషల్ విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా పున్నమి ఘాట్‌లో ప్రత్యేకంగా మహిళల కోసం 'శ్రీ శక్తి' మహోత్సవం నిర్వహించారు. దుర్గస్తుతి పాటకు సూరపనేని అనన్య సోలో క్లాసికల్ డ్యాన్స్‌ను ప్రదర్శించారు. అనన్య నాట్య విన్యాసం ఆహూతులను కట్టిపడేసింది. దుర్గమ్మను స్తుతిస్తూ నర్తించిన అనన్య అభినయం రక్తి కట్టించింది. అనూ ష బృందం చేసిన శాస్త్రీయ నృత్యాలు ఆహూతులను అలరించాయి. అయిగిరి నందిని పాట, పలుకే బంగారమాయేనే పాటలకు అనూష బృందం అద్భుత నా ట్యం చేసింది. ఏపీ క్రియేటివ్ అండ్ కల్చరల్ కమిషన్ చైర్ పర్సన్ తేజస్విని తప్పెటగుళ్ల జానపద నృత్యం గురించి ప్రేక్షకులకు పరిచయం చేశారు. తప్పెట గుళ్ల జానపద నృత్యాన్ని ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించారు. వయోలిన్ విద్వాంసురాలు కామాక్షి ప్రదర్శన ఆకట్టుకుంది. ఆమె సంగీతానికి తోడు మరొకరు సూట్‌కేసుపై డ్రమ్స్ వాయిద్యం ఆకట్టుకున్నాయి. ప్రేక్షకుల మధ్యకు కూడా వెళ్లి వయోలిన్ సంగీతం వాయిస్తూ అందరినీ ఆహ్లాదపరిచారు.

ఉత్సవ్‌లో స్పీకర్ల సందడి

విజయవాడ ఉత్సవ్‌లో పాల్గొనేందుకు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు పున్నమి ఘాట్‌కు చేరుకున్నారు. ఇద్దరికీ ఎంపీ కేశినేని చిన్ని ఘనస్వాగతం పలికారు. పున్నమిఘాట్‌లో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ ఆలయ సెట్టింగ్‌కు తీసుకు వెళ్లారు. అక్కడ అమ్మవారిని అయ్యన్నపాత్రుడు, రఘురామకృష్ణంరాజులు దర్శనం చేసుకున్నారు. తర్వాత ఫుడ్‌స్టాళ్లను సందర్శించారు. విజయా డెయిరీ ఏర్పాటు చేసిన స్టాల్‌లో అయ్యన్నపాత్రుడు, రఘురామ కృష్ణంరాజు ఇద్దరూ మిఠాయిలను రుచి చూశారు. తర్వాత విజయవాడ ఉత్సవ్ సెల్ఫీ పాయింట్ దగ్గర ఫొటోలు దిగారు. జిల్లా సమగ్ర సమాచారంతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆసక్తిగా తిలకించారు. మన ఊరు.. మన ఊహలని ఉన్న సైన్‌బోర్డుపై ఇద్దరూ సంతకాలు చేశారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షించారు.

అబ్బురపరిచిన చేనేత ప్రదర్శన

చేనేత వస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంది. రాష్ట్ర చేనేత జౌళి శాఖ నేతృత్వంలో 2024లో గోల్డ్ అవార్డు సాధించిన వారితో చేనేత వస్త్రధారణ ప్రదర్శన ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని చేనేత వస్త్రాలకు ప్రతినిధులుగా వాటిని ధరించి ప్రదర్శన చేశారు. కోనేరు శివకాంచనలత నేతృత్వంలో ఐఏఎస్ అధికారిణిలు సుప్రజ, రేఖారాణి, ఎంపీ సతీమణి కేశినేని జానకీ లక్ష్మి, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ఏపీ కల్చరల్, క్రియేటివ్ కమిషన్ చైర్మన్ తేజస్విని, విష్ణు ప్రియ, డాక్టర్ సింధు, బాలినేని కీర్తి, శిరీష చేనేత వస్త్రాలను ధరించి ప్రదర్శన నిర్వహించారు.

నాన్ స్టాప్ జోష్! ఉత్సవ్ మస్తీ!

నాన్ స్టాప్ మస్తీతో నగర ప్రజలు ఓలలాడారు. బెజవాడ ఉత్సవ్‌కు ఊపొచ్చిం ది. పున్నమిఘాట్, సంగీత కళాశాల, తు మ్మలపల్లి కళాక్షేత్రాల్లో జరుగుతున్న సంగీత, నృత్య, నాటక ప్రదర్శనలు దిగ్విజయంగా జరుగుతున్నాయి. అన్ని వేదికల కు సందర్శకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఎవరికి ఇష్టమైనవి వారు వీక్షిస్తున్నారు. ఈ అంతులేని ప్రజాదరణ రానున్న కార్యక్రమాలకు మరింత జోష్ నెలకొనబోతోంది. ఇక ఎగ్జిబిషన్ కూడా వస్తే ఆ కిక్కే వేరు. 4వ రోజు ఉత్సవ్‌కు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పా త్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

దేశ నలుమూలలకూ మన సంస్కృతి: ఎంపీ చిన్ని

సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే వేదికగా విజయవాడ ఉత్సవ్ నిలుస్తుంది. మైసూరు తరహా దసరా వేడుకలను ఇంద్రకీలాద్రి అమ్మవారి సన్నిధిలో జరిపించాలనే సంకల్పంతో ప్రారంభించిన ఈ ఉత్సవం విజయవంతమైంది.

మెగా కార్నివాల్.. గిన్నిస్‌కు దరఖాస్తు

దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడ నగరంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్‌కు ప్రపంచ గుర్తింపును తీసుకు వచ్చేందుకు నిర్వాహక కమిటీ సన్నాహకాలు చేస్తోంది. ఈ నెల 28న బందరు రోడ్డులో నిర్వహించే మెగా ఉత్సవ్ కార్నివాల్ ద్వారా గిన్నిస్ రికార్డు నెలకొల్పేందుకు నిర్ణయించింది. విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఇప్పటికే గిన్నిస్ బుక్ నిర్వాహకులతో సంప్రదించారు. ప్రపంచవ్యాప్తంగా కార్నివాల్స్ జరుగుతుంటాయి. వాటికెంతో క్రేజు ఉంటుంది. అలాంటిది మొదటిసారిగా నిర్వహిస్తున్న కార్నివాల్ ప్రయత్నంలోనే గిన్నిస్ రికార్డు నెలకొల్పే ప్రయత్నం చేయటం విశేషం. బందరు రోడ్డుపై కంట్రోల్ రూమ్ నుంచి బెంజిసర్కిల్ వరకు మన సంప్రదాయ దసరా వేషాలతో మెగా కార్నివాల్‌ను నిర్వహించాలని ప్లాన్ చేశారు. మన దేశంలోని భిన్న సంస్కృతులు, జానపద కళారూపాలు, సంప్రదాయ వేషధారణలతో భారీగా కార్నివాల్‌ను నిర్వహించబోతున్నారు. ప్రపంచంలో ఇప్పటి వరకు నిర్వహించిన అతి పెద్ద కార్నివాల్స్ కంటే భారీగా నిర్వహించేందుకు వీలుగా అన్ని రాష్ట్రాల నుంచి కళాకారులను రప్పిస్తున్నారు. బందరు రోడ్డుపై వేలాదిమందితో కార్నివాల్ నిర్వహించటం ద్వారా గిన్నిస్ రికార్డు నమోదు చేసి విజయవాడ ఉత్సవ్‌ను ప్రపంచానికి పరిచయం చేయాలని భావిస్తోంది.



అలరించిన డ్రోన్ షో

మహాకనకదుర్గ బ్యాక్ గ్రౌండ్ సాంగ్‌గా మొదలైన డ్రోన్ షో. అమ్మవారి రూపాలతో, విజయవాడ ప్రముఖ స్థలాల నమూనాలతో డ్రోన్ షో ఏర్పాటు చేశారు. డ్రోన్ షోను స్పీకర్లు ఇద్దరూ ఆసక్తిగా తిలకించారు.

కేటుగాళ్ల సైబర్ ఉచ్చులు

● నెల కిందట లయన్స్ క్లబ్ నేత నుంచి రూ.6లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు
● తాజాగా మరో లయన్స్ క్లబ్ నేతపై ప్రయత్నం

హనుమాన్‌జంక్షన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): సైబర్ కేటుగాళ్లు క్రైం డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నామని ఫలాన కేసులో మీపేరుందని వాట్సాప్ కాల్‌లో బెదిరిస్తూ డబ్బులు గుంజడానికి చేస్తున్న ప్రయత్నాలు పెరుగుతున్నాయి. హనుమాన్‌జంక్షన్ ప్రాంతంలో నెల కిందట లయన్స్ క్లబ్ నేత మేడికొండ బుచ్చిబాపయ్య వద్ద రూ.6లక్షలు అపహరించిన ఘటన మరువక ముందే బుధవారం అప్పనవీడు గ్రామానికి చెందిన మరో లయన్స్ క్లబ్ నేత బోయపాటి పూర్ణను బెదరించి రూ.లక్షలు అపహరణకు చేసిన ప్రయత్నం వెలుగులోకి వచ్చింది. మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని మహిళ వాట్సాప్ కాల్ చేసి విజయవాడ పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నామని చెప్పి బెంగుళూరు క్రైం డిపార్టుమెంట్ వారు లైన్‌లో ఉన్నారని వారితో మాట్లాడాలని కాల్ కలిపింది. బెంగూళూరు గాంధీనగర్ పోలీస్ స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని ఫేక్ ఆధార్ కార్డు ద్వారా సిమ్ తీసుకొని అసాంఘిక కార్యకలాపాలకు ఆ సిమ్‌ను వినియోగిస్తున్నట్టు సమాచారం ఉందని, ఆ కేసులో అరెస్టు చేయాల్సి వస్తుందని బెదిరించారు. ఆ కేసు నుంచి తప్పించడానికి ఖర్చవుతుందని నమ్మబలికి బెదిరించడానికి ప్రయత్నం చేశారు. దాదాపు 6గంటల పాటు వాట్సాప్ కాల్ లోనే నిర్బంధించి మంతనాలు జరిపారు. కేటుగాళ్లకు ఆయన దీటైన సమాధానం చెప్పడంతో వెనక్కి తగ్గారు. ఈ వాట్సాప్ కాల్‌పై పెదపాడు పోలీస్ స్టేషన్‌లో బోయపాటి పూర్ణ ఫిర్యాదు కూడా చేశారు. నెల కిందట వృద్ధ నేత బుచ్చిబాపయ్యను కూడా ఇలాగే వాట్సాప్ కాల్ చేసి మహిళల అక్రమ రవాణాకు సంబంధించిన కేసులో మీ పేరుందని గంటల తరబడి ఫోన్‌లో నిర్బంధించి తన అకౌంట్ నుంచి వారి అకౌంట్‌కు రూ.6లక్షలు బదిలీ చేయించుకున్నారు. ఈ ఘటనతో జంక్షన్ వాసులు అవాక్కయ్యారు. తాజాగా బోయపాటి పూర్ణ ఘటన వెలుగులోకి రావడంతో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు.

గుడ్లవల్లేరులో 87 ఏళ్ల వృద్ధుడిని మోసగించే యత్నం

గుడ్లవల్లేరు: సైబర్ నేరాలకు పాల్పడే దుర్మార్గులు నేరం చేసేందుకు ప్రయత్నించి కుదరనిపక్షంలో ఫోన్‌లో దుర్భాషలకు దిగుతున్నారు. గుడ్లవల్లేరుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడైన ఎస్ పరందామయ్యపై సైబర్ నేరానికి యత్నించిన వ్యక్తి లొంగపోయేసరికి పత్రికల్లో రాయలేని పదజాలంతో దూషించిన ఉదంతమిది. పరందామయ్యకు ప్రైవేట్ మొబైల్ నెట్‌వర్క్ నుంచి ఫోన్ చేస్తున్నాని చెప్పి ఒక గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. నీ ఆధార్ కార్డుతో బెంగుళూరులో ఒక నెంబరు తీసుకుని దాన్నుంచి అసభ్యకర మెసేజ్‌లు పెడుతున్నారని, మాకు ఫిర్యాదు వచ్చిందని అది మీ పేరుతోనే ఉందని, నీపై యాక్షన్ తీసుకుంటానని బెదిరించాడు. విషయం అర్థమైన పరందామయ్య ఏం చేసుకుంటావో చేసుకోమని అనడంతో తన పాచిక పారలేదని బూతుల పర్వం మొదలు పెట్టి వినలేని, రాయలేని పదాలతో దూషించి ఫోన్ కట్‌చేశాడు. 87 ఏళ్ల వయస్సులోనూ పరంధామయ్య జంకకుండా పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు ఆ నెంబరును ట్రేస్ చేసే ప్రయత్నం చేయగా అడ్రెస్ చూపించలేదన్నారని ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఇలాంటి మోసపూరిత కాల్స్‌కు స్పందించవద్దని వ్యక్తిగత సమాచారం, ఆధార్, ఓటీపీలు ఇవ్వవద్దని గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్వీవీ సత్యనారాయణ అన్నారు.

బెస్ట్ లిఫ్టర్లుగా వేణుగోపాల్, గాయత్రి

● ముగిసిన ఉమ్మడి జిల్లాల ఓపెన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

గుడివాడ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కృష్ణాజిల్లాల ఓపెన్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఘనంగా ముగిశాయి. పోటీల బెస్ట్ లిఫ్టర్లుగా ఎస్ వేణుగోపాల్, ఓ గాయత్రి నిలిచారు. పురుషుల 49 కేజీల శరీర బరువు విభాగంలో ఎం తరుణ్‌తేజ, పీ శ్యామ్, బీ మోహిత్ ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు, 56 కేజీల శరీర బరువు విభాగంలో టీ నరేంద్ర, బీ దివాకర్, యూవీ పూర్ణలు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు, 60 కేజీల శరీర బరువు విభాగంలో జే నవీన్, వీ షణ్ముఖ్, ఎం కుమారరాజా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు, 65 కేజీల శరీర బరువు విభాగంలో వీ సుధీర్, బీ మూల్యతేజ, ఈ లోహిత్ ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు, 71 కేజీల శరీర బరువు విభాగంలో ఎస్ వేణుగోపాల్, కే లోకేశ్, బీ మణిదీప్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు, 79 కేజీల శరీర బరువు విభాగంలో షేక్ రషీద్, ఎం అజయ్‌దేవన్, బీ రవిచంద్ర ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు, 88 కేజీల శరీర బరువు విభాగంలో ఆర్ నాగ అర్జునరెడ్డి, ఎస్ జగదీష్, బీ చైతన్య ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు, 94 కేజీల శరీర బరువు విభాగంలో ఎం వెంకటరెడ్డి, పీ దయాసాగర్, బీ లక్ష్మణ్‌బాబు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు, 110 కేజీల శరీర బరువు విభాగంలో బీ విష్ణు, బీ ఆదిత్య, ఏ బాలవంశీ ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు, ప్లస్ 110 కేజీల శరీర బరువు విభాగంలో జీ రాజశేఖర్, ఎం యేసుబాబు, డీ రామ్‌కుమార్ ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించారు. మహిళల విభాగంలో 40 కేజీల శరీర బరువు విభాగంలో జీ లోహిత, వీ సువర్ణనాగదుర్గ, ఆర్ భావన ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు, 44 కేజీల శరీర బరువు విభాగంలో ఎన్వీ నాగ అను, ఎస్ నాగలక్ష్మి, పీ త్రివేణి ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు, 48 కేజీల శరీర బరువు విభాగంలో కే విజయశ్రీ, కే లలిత, జీ రచన ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు, 53 కేజీల శరీర బరువు విభాగంలో జీ నవనీత, జీ హారిక, పీ హారిక ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు, 58 కేజీల శరీర బరువు విభాగంలో ఈ అఖిల, పీ హితసంజన, పీ ఆశ్లేషిత ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు, 63 కేజీల శరీర బరువు విభాగంలో ఓ గాయత్రి, జే శిరీష, ఏకే ఆశ్యాంజలి ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు, 69 కేజీల శరీర బరువు విభాగంలో ఎం తిరుపతమ్మ, డీ లావణ్య, ఎన్ శిరీష ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు, 77 కేజీల శరీర బరువు విభాగంలో బీ ఝాన్సీ, కే వరలక్ష్మి, ఎం ఆశ్రిత కీర్తి ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు, 86 కేజీల శరీర బరువు విభాగంలో జే నిషి గోస్పాల్, వీ శ్రీహరిత, టీ శర్మికా ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు, ప్లస్ 86 కేజీల శరీర బరువు విభాగంలో జీ సుభాషిణి, కే చైతన్య, కే సత్యవతి ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించారు.

గొల్లపూడిలోని ఎలక్ట్రికల్ గోడౌన్‌లో భారీ చోరీ

● రూ.30లక్షల పైగా విలువైన సరుకు చోరీ?

విద్యాధరపురం, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): గొల్లపూడి వై జంక్షన్ సెంటర్ వద్ద జక్కంపూడి కాలువ రోడ్డులో ఉన్న ఓ ఎలక్ట్రికల్ గోడౌన్‌లో భారీ చోరీ జరిగిన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. వన్‌టౌన్‌కు చెందిన ప్రముఖ వ్యాపారివేత్త ఎలక్ట్రికల్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఇతడికి గొల్లపూడి, జక్కంపూడి కాలువ రోడ్డులో గోడౌన్ ఉంది. ఇందులో విలువైన వస్తువులున్నాయి. గోడౌన్‌లో సరుకు చోరీకి గురైనట్టు ఆ పారిశ్రామికవేత్త గుర్తించారు. దీంతో గోడౌన్‌కు వెళ్లి పరిశీలించగా ఎలక్ట్రికల్ సామగ్రి భారీగా చోరీకి గురైనట్టు తెలుసుకున్నాడు. దీంతో బాధితుడు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోడౌన్‌లో ఎంత మంది సిబ్బంది పనిచేస్తున్నారన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సీసీ టీవీ ఫుటేజ్‌ను పరిశీలించారు. దొంగతనానికి పాల్పడిన వారు ఒకేరోజు కాకుండా, పలు దఫాలుగా సరుకును దొంగిలించి కారులో తరలించినట్టు పోలీసులు గుర్తించారు. ఒక వ్యక్తి కారు నడుపుతుండగా, మరో వ్యక్తి రోడ్డుపై కారు వెనుక ఉన్నట్టు, ఓ వ్యక్తి ఎవరితోనో ఫోన్‌లో మాట్లాడుతున్నట్టు పోలీసులు గుర్తించారు. గోడౌన్‌లో పనిచేసే సిబ్బందే దొంగతనానికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. సరుకు సుమారు రూ.30లక్షలకు పైగా చోరీకి గురైనట్టు బాధితుడు పోలీసు అధికారులకు చెప్పినట్టు సమాచారం. గోడౌన్‌లో సరుకు ఏ మేరకు ఉంది, రికార్డుల ప్రకారం ఉందా లేదా, ఎప్పుడెప్పుడు గోడౌన్‌లో ఎగుమతి, దిగుమతి చేశారనే అంశాలను పోలీసు అధికారులు ఆరా తీస్తున్నారు.

స్టాన్‌ఫర్డ్ ర్యాంకింగ్స్‌లో 'ఎల్వీ' పరిశోధకులు

పెనమలూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన ప్రతిష్ఠాత్మక స్టాన్‌ఫర్డ్ టాప్ 2 శాతం వరల్డ్ సైంటిస్ట్ ర్యాంకింగ్స్‌లో తాడిగడప ఎల్వీప్రసాద్ ఆసుపత్రి పరిశోధకులు స్థానం సంపాదించారని ఆసుపత్రి హెడ్ డాక్టర్ అనసూవ గంగూలీ తెలిపారు.

ప్రామాణిక సైటేషన్ మెట్రిక్స్ ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ పనితీరు కనబరచిన పరిశోధకుల జాబితాను విడుదల చేసిందని ఇందులో ఆసుపత్రికి చెందిన ఏడుగురు శాస్త్రవేత్తలు జీవితకాల ర్యాంకింగ్స్‌లో, 15మంది వార్షిక ర్యాంకింగ్స్‌లో చోటు దక్కించుకున్నారన్నారు. ఆసుపత్రి వ్య వస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గుళ్లపల్లి ఎస్ రావు దేశ నేత్ర వైద్యరంగంలో, జీవిత కాల ర్యాంకింగ్స్‌లో 2వ స్థానంలో ని లిచారన్నారు. దీంతో దేశంలోనే అత్యంత ప్రముఖ నేత్రవైద్య శాస్త్రవేత్తగా ఆయన స్థానం బలోపేతమైందన్నారు.

దేశవ్యాప్తంగా 61మంది భారతీయ నేత్రవైద్య శాస్త్రవేత్తలు ర్యాంకింగ్స్‌లో స్థానం సంపాదించుకోగా అందులో ఎల్వీప్రసాద్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ గుళ్లపల్లి ఎస్‌రావుతో పా టు డాక్టర్ సావిత్రి శర్మ, ప్రొఫెసర్ బాలసుబ్రమణియన్, డాక్టర్ మహ్మద్ జావేద్ అలీ, డాక్టర్ ప్రశాంత్‌గర్గ్, డాక్టర్ తారాప్రసాద్ దాస్, డాక్టర్ స్వాతి ఉన్నారని తెలిపారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	117, 125, 136
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 550	



చేపల చెరువుల వేలం పాట అక్టోబరు 4న

గుడివాడ రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మోటూరు గ్రామంలో 8 చేపల చెరువులను అక్టోబరు 4న వేలం పాట నిర్వహించటానికి ఏర్పాట్లు చేసినట్లు కార్యదర్శి జనార్ధనరావు గురువారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 చేపల చెరువులను ఉదయం ఖచ్చితంగా పది గంటలకు వేలం పాల నిర్వహించనున్నామన్నారు. వేలంలో పాల్గొనే ప్రతీ వ్యక్తి తహసీల్దార్ లేదా బ్యాంక్ ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాలని తెలిపారు. అర్హత ఉన్న వారందరూ పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరారు.



ఈ-క్రాప్ నమోదు రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ సునీల్

పంట నమోదు తప్పనిసరి

పమిడిముక్కల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతూ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని గన్నవరం ఏడీఏ సునీల్ అన్నారు. తాడంకి రైతుసేవాకేంద్రంలో గురువారం పంట నమోదు ప్రక్రియ రికార్డులను ఆయన తనిఖీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుసేవాకేంద్రాల్లో వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉంటారని, ప్రతిరైతూ దగ్గరలోని రైతుసేవాకేంద్రానికి వెళ్లి పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేసుకునేందుకు సమయం తక్కువగా ఉన్నందున రైతులు ఈ అవకాశం వినియోగించుకోవాలని పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారి గణేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

జాబ్ కార్డులు ఈకేవైసీ చేయించుకోవాలి

పమిడిముక్కల : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో సీతారామరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో 17,963 జాబ్‌కార్డులకు ఇప్పటివరకు 9,462 కార్డులు మాత్రమే ఆధార్ లింక్ అయినట్టు తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి కూలీల జాబ్‌కార్డులు ఆధార్ అనుసంధానం చేయించాలన్నారు. కపిలేశ్వరపురం, మేడూరు, తాడంకి గ్రామాల్లో ఎక్కువగా ఆధార్ లింక్ అయినట్టు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో లక్ష్మీరెడ్డి తెలిపారు.

బాస్కెట్‌బాల్ పోటీలు 27 నుంచి

గుడివాడ : వార్షిక క్రీడా ప్రణాళికలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 29వతేదీ వరకు ఒకటో ఎన్టీఆర్ మెమోరియల్ రాష్ట్రస్థాయి పురుషుల ఓపెన్ ఇన్విటేషన్ బాస్కెట్‌బాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర బాస్కెట్‌బాల్ అసోసియేషన్‌కు అనుబంధంగా ఉన్న జట్లు మాత్రమే పోటీల్లో పాల్గొంటాయన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.15వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు, తృతీయ బహుమతిగా రూ.7వేలు అందించనున్నారు. పోటీల్లో బెస్ట్ షూటర్‌కు రూ.1500లు, బెస్ట్ ప్లేయర్‌కు రూ.1500ల నగదు బహుమతులను అందిస్తున్నట్టు కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి పేర్కొన్నారు.



గుడివాడలో..



గుడివాడ రూరల్‌లో..



కూచిపూడిలో..



పామర్రులో..



పెదపారుపూడిలో..

కాత్యాయనీ .. కరుణించమ్మా



తోట్లవల్లూరులో..

దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన గురువారం పలు దేవాలయాల్లోని అమ్మవారు కాత్యాయనిదేవిగా అలంకారంలో దర్శనమిచ్చారు.

గుడివాడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) : స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానంలో కొనసాగుతున్న దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి గోపాలరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ చిన్నా, దేవాదాయ శాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గౌరీశంకరస్వామి దేవస్థానంలో అమ్మవారు కాత్యాయనీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల కమిటీ చైర్మన్ బోసు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి దేవస్థానంలో అమ్మవారు గజలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల కమిటీ చైర్మన్ అంగడాల సతీష్ సభ్యులు, దేవాదాయ శాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు విజయ లక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో గోపాలరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ లింగం చిట్టిబాబు, భక్తులు పాల్గొన్నారు.

స్థానిక నీలామహల్ రోడ్డులో వేంచేసియున్న విజయ దుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి గంగు శిరీషా, ధర్మకర్తల కమిటీ చైర్మన్ హరిబాబు, భక్తులు పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: చిన ఎరుకపాడులోని అష్టలక్ష్మీ ఆలయంలో అమ్మవారు గజలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆలయ చైర్మన్ బొప్పూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ట్రస్టీ సభ్యులు, ఆలయ అర్చకులు, వేదపండితుల నడుమ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ ట్రస్టీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దొండపాడు, చౌటపల్లి, మోటూరు, బొమ్ములూరు తదితర గ్రామాల్లో పూజలు చేశారు.



పూజల్లో పాల్గొన్న చైర్మన్ వెంకట విష్ణుమోహన్‌రావు

కొండాలమ్మ ఆలయంలో..

గుడ్లవల్లేరు : వేమవరం కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో గురువారం అమ్మవారు కాత్యాయినీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి సహస్రనామార్చన, శీఘ్ర వివాహమునకు, కుజదోష పరిహారమునకు కాత్యాయనీ మూలమంత్ర హవనం నిర్వహించారు. సాయంత్రం సాయంకాలర్చన, అమ్మవారికి ఊంజల సేవ, పంచహారతులు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో కొండలరావు, చైర్మన్‌వెంకట విష్ణుమోహనరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

కూచిపూడి : శరన్నవరాత్రి మహోత్సవ వేడుకల్లో భాగంగా నాల్గవ రోజైన గురువారం పలు గ్రామాల్లోని దేవాలయాల్లో అమ్మవారు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పెదసనగల్లు, భట్లపెనుమర్రు, కూచిపూడి, చినముత్తేవి, పెదపూడి, మొవ్వ, మొవ్వపాలెం, కొండవరం, కాజ, కోసూరు, వేములమడ, అయ్యంకి, నిడుమోలు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో విశేష పూజలు, కుంకుమార్చన, హోమాది కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పామర్రు : పామర్రులోని గంగాపార్వతి సమేత సోమేశ్వరస్వామి దేవాలయంలో గురువారం అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అంకమ్మతల్లి దేవస్థానంలో కాత్యాయనిదేవిగాను, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు సంతానలక్ష్మీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. పెదమద్దాలి, కురుమద్దాలి దేవాలయాల్లో పూజలు ఘనంగా జరుగుతున్నాయి.

పెదపారుపూడి : పెదపారుపూడిలోని సీతారామ స్వామి దేవాలయంలో గురువారం గాయత్రీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారికి అర్చకులు లక్ష్మీనరసింహారావు పూజలు చేశారు.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులోని భ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయంలో గురువారం కనకదుర్గమ్మ అమ్మవారు కాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కాత్యాయనిదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వల్లూరుపాలెం కరకట్ట వద్ద శివాలయం, భద్రిరాజుపాలెం శివాలయం తదితర గ్రామాల్లో అమ్మవారు కాత్యాయనిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పాల్గొన్నారు.

వెండి ఆభరణం బహూకరణ

పామర్రు, సెప్టెంబరు25(ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాల అభివృద్ధికి దాతలు మరింత ముందుకు వచ్చి సహకరించాలని దేవస్థానం అధికారి పీవీఎస్ ప్రసాదరావు అన్నారు. బల్లిపర్రులో వేంచేసి యున్న వేణుగోపాలస్వామి ఆలయానికి విజయవాడకు చెందిన జాస్తి నాగేశ్వరావు, కామాక్షి దంపతులు రూ.24వేల విలువగల 194గ్రాముల వెండి ఆభరణాలను స్వామి వారికి బహూకరించినట్టు ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో తమ్మారెడ్డి సంజీవరావు, నారాయణ, రామకృష్ణ ప్రధాన అర్చకుడు వేదాంతం గోపాలకృష్ణ, తమ్మారెడ్డి రవీంద్ర బాబు పాల్గొన్నారు

ఔషధాల రూపకల్పనలో ఫార్మసిస్టు పాత్ర కీలకమైంది

● **వైపీసీ ప్రసాద్**

గుడ్లవల్లేరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఔషధాల రూపకల్పనలో ఫార్మసిస్టు పాత్ర కీలకమైందని జిల్లా లయన్స్ మాజీ గవర్నర్ వైపీసీ ప్రసాద్ అన్నారు. గురువారం గుడ్లవల్లేరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక వి.వి.ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సస్ కళాశాలలో వరల్డ్ ఫార్మసిస్ట్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, అసిస్టెంట్ ప్రొఫిసర్స్ బి.సత్యశ్రీ, టి.శ్రావణి, వి.ఎల్.వినోద్ కుమార్, కె.పరిమళలను సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మేరుగు పెరుమాళ్లరావు, కార్యదర్శి కల్యాణపు నవాబు, కోశాధికారి పెంటపాటి చిట్టిబాబు, జోన్ చైర్‌పర్సన్ నిమ్మగడ్డ శశికళ, కాకాని రామారావు, ఈదా కొండయ్య, పరందామయ్య పాల్గొన్నారు.

ఫార్మశీ విద్యార్థులకు బహుమతి ప్రదానం :

వరల్డ్ ఫార్మసిస్టు డే సందర్భంగా వి.వి.ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో ఐపీఏ గుడ్లవల్లేరు లోకల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా గుడివాడ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.జయలక్ష్మి హాజరై విద్యార్థులకు ఫార్మసిస్టు బాధ్యతలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, ఐపీఏ గుడ్లవల్లేరు లోకల్ బ్రాంచ్ ప్రెసిడెంట్‌రవిష, ప్రశాంతి పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ ఎ.లక్ష్మణరావు, అధ్యాపకులను సన్మానిస్తున్న లయన్స్ ప్రతినిధులు

గర్భిణులు, బాలింతలకు పోషకాహారం తప్పనిసరి

తోట్లవల్లూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కుటుంబంలో మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబమంతా ఆరోగ్యంగా, సంతోషంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె. నాగమల్లేశ్వరి అన్నారు. పెనమకూరు అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ మహోత్సవంలో భాగంగా తల్లులకు పోషకాహారం, శారీరక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రక్తహీనతను అధికమించాలంటే ఆకుకూరలు విరివిగా వాడాలన్నారు. ఎంపీటీసీ సభ్యుడు మరీదు శివమధుబాబు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పెదపారుపూడిలో..



సమావేశంలో మాట్లాడుతున్న నాగమల్లేశ్వరి

పెదపారుపూడి : గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ఇస్తున్న పోషకాహారాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ అరుణ కుమారి పేర్కొన్నారు.గురువారం గురువిందగుంటలో అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాస ఉత్సవాలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు బయట దొరికే జంక్ ఫుడ్‌లు తినకూడదన్నారు. ఏఎన్ఎంలు పాల్గొన్నారు

ప్రతి ఒక్కరికీ జీఎస్టీపై అవగాహన తప్పనిసరి

● **ఇంచార్జ్ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు**

గుడివాడ రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు ఏయే వస్తువులు కొనుగోలు చేస్తే ట్యాక్స్ పడుతుందో కార్యదర్శులకు అవగాహన ఉండాలని ఇంచార్జ్ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జీఎస్టీపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యదర్శులు ట్యాక్స్‌ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ డైరెక్టర్ జగదీష్ బాబు మాట్లాడుతూ నూతన జీఎస్టీలో ఎంత శాతం పన్నులు తగ్గించారో అందరూ తెలుసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సాయి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇంచార్జ్ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు

భీమేశ్వరస్వామి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా పట్టపు చిన్నా

గుడివాడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) : స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానంలో ఘనంగా నిర్వహిస్తున్న దేవి నవరాత్రి మహోత్సవాల ఉత్సవ కమిటీ చైర్మన్‌గా పట్టపు చిన్న నియమితులయ్యారు. సభ్యులుగా పెన్నేరు విశ్వనాథం, తేళ్ల సూర్యనారాయణ, దొండపాటి నాగరాజు, పొగిరి వెంకటరమణ, గేదెల కల్యాణి, వెట్టం మాధురీలత, ఎరుకపాటి సుశీల, మాదాల సునీత, ముప్పిడి ఉమామహేశ్వరరావు, పత్తిపాటి శ్రీవిద్యలు నియమితులయ్యారు.



పట్టపు చిన్న

స్థానిక పాటిమీద వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవస్థాన ఉత్సవ కమిటీ చైర్మన్‌గా లింగం శివరామప్రసాద్(చిట్టిబాబు), సభ్యులుగా నిమ్మగడ్డ కృష్ణారావు, చందు శ్రీనివాస్, జె.రాజేశ్వరరావు, వేదాంతం కృష్ణవేణి, కొడాలి విజయలక్ష్మీ, గూడపాటి సుజాత, పంతంగి హేమ, జోగి సాంబశివరావులను నియమించింది. ఈ మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

గుండెపోటుతో బిల్ కలెక్టర్ మృతి

పెదపారుపూడి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): వెంట్రప్రగడ గ్రామపంచాయతీలో బిల్ కలెక్టర్‌గా పని చేస్తున్న మూడే శ్రీనివాసరావు హఠాన్మరణం చెందటంపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి ఇంటి వద్ద గుండెపోటుకు గురై చికిత్స అందేలోపు మృతి చెందటం పట్ల వారు తమ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గ్రామసర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి, గ్రామ పీఏసీఎస్ అధ్యక్షులు కూచిపూడి వెంకట సుబ్బయ్య, టీడీపీ నాయకులు జాజుల ప్రసాద్, గొరిపర్తి రవికుమార్, పొనుగోటి సత్యనారాయణ, విజయబాబు సంతాపం ప్రకటించారు.

ఓజీ సినిమాను వీక్షించిన ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ : స్థానిక సెక్స్ థియేటర్‌లో బుధవారం రాత్రి ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నటించిన ఓజీ ప్రీమియర్ సినిమా ప్రదర్శనను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్‌లు వీక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, పవన్‌కల్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నటించిన ఓజెస్ గంభీర(ఓజీ) చిత్ర విజయోత్సవాలు గుడ్లవల్లేరు రామకృష్ణా థియేటర్ వద్ద పవన్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. జనసేన నాయకుడు చిలంకుర్తి వెంకటేష్ కేక్‌ను కట్‌చేసి అభిమానులకు తినిపించారు. అనంతరం భారీగా బాణాసంచా పేల్చి సంబరాలు చేశారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

గుడివాడ : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించకుంటే ఎంపీ, ఎమ్మెల్యేల కార్యాలయాలను ముట్టడిస్తామని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రేపాని కొండ హెచ్చరించారు. గురువారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు మండలి సత్యనారాయణ, తాపీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు సీతారామయ్య పాల్గొన్నారు.

పారబడితే .. ప్రమాదమే

కూచిపూడి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కూచిపూడిలోని ప్రధాన రహదారులు గుంతలమయంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొద్దిపాటి వర్షానికే గోతులన్నీ వర్షపు నీటితో నిండిపోయి వాహనదారులు రాకపోకల సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. రహదారిపై ఏర్పడ్డ గోతులకు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోతుందని గ్రామస్థులు వాపోతున్నారు. కూచిపూడి, మొవ్వ రహదారిలోని జయలక్ష్మి హాస్పటల్ ఎదురుగా ఏర్పడిన పెద్ద పెద్ద గోతులతో నిత్యం వాహనదారులు సర్కస్‌ఫీట్లు చేయాల్సి వస్తోంది. కూచిపూడి నుంచి మొవ్వ వరకు ప్రధాన రహదారులు నరకకూపంగా మారాయి. ధ్వంసమైన రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



కూచిపూడి ప్రధాన రహదారి దుస్థితి

వివాహిత కనిపించడం లేదని ఫిర్యాదు

గుడివాడ, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి) : స్థానిక సత్యనారాయణపురం, రెడ్డి సింహాచలం వీధికి చెందిన తోట అనుపమ బుధవారం ఉదయం విజయవాడ కనకదుర్గమ్మవారిని దర్శించుకునేందుకు వెళ్లింది. స్వయంగా భర్త హరిప్రసాద్ ఆమెను గుడివాడ బస్టాండ్‌లో దింపాడు. బుధవారం ఉదయం వెళ్లిన అనుపమ తిరిగి రాకపోవడంతో పలుమార్లు ఫోన్‌కు కాల్ చేయగా, స్విచ్ఛాఫ్ వచ్చింది. ఈ క్రమంలో హరిప్రసాద్ గురువారం టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై పి.లవరాజు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

● **ఎంపీపీ గద్దె పుష్పరాణి**



గుడివాడ రూరల్‌లో..

గుడివాడ రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు పెంచాలని ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణ శుభ్రపరిచి స్వచ్ఛతా హి సేవా 2025 కార్యక్రమం కింద ఎంపీపీ, జడ్పీటీసీ గోళ్ల రామకృష్ణ తదితరులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. జడ్పీటీసీ గోళ్ల రామకృష్ణ, ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

గుడివాడ : స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద గుడివాడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం ఏక్ దిన్-ఏక్ గంట-ఏక్ సాత్ కార్యక్రమంలో పరిసరాలను శుభ్రపరిచారు. ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, స్థానికులు పాల్గొన్నారు.



గుడివాడలో..



గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు : స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం గుడ్లవల్లేరులో ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాథ్ అనే కార్యక్రమాన్ని గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించారు. శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, గ్రామస్థులు, లయన్స్ క్లబ్ సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది కలసి శ్రమదానం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. గుడివాడ డీఎల్‌డీవో జి.సంపత్ కుమారి, ఎంపీడీవో మహ్మద్ ఇమ్రాన్, డిప్యూటీ ఎంపీడీవో అంజనాదేవి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కరుణకుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పెరుమాళ్లరావు, నరసింహారావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	117, 125, 136
చికెన్ విత్ స్కిన్	222
చికెన్ స్కిన్‌లెస్	232

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

కంప్యూటర్ ఆపరేటర్లపై చర్య తీసుకోవాలి : సీపీఐ నేత మోదుమూడి



సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలతకు ఫిర్యాదు చేస్తున్న రామారావు

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సర్వజన ఆసుపత్రిలో మహిళా సిబ్బందిని కంప్యూటర్ ఆపరేటర్లు వేధిస్తున్నారని, విచారణ జరిపి వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకుడు మోదుమూడి రామారావు గురువారం సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలతకు ఫిర్యాదు చేశారు. ఎఫ్ఎన్‌వో దుర్గ విధులు ముగించుకుని వెళుతుండగా కంప్యూటర్ ఆపరేటర్లు వేధించడంతో మనస్తాపంతో నిద్ర మాత్రలు మింగిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. వాస్తవాలు విచారించాలని మోదుమూడి రామారావు, వి.చైతన్యకుమార్, నిర్మల కోరారు.



పోటీల్లో పాల్గొన్న సీతారామాంజనేయ భజన సమాజం

ప్రాచీన కళలను కాపాడుకోవాలి

ఘంటసాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చల్లపల్లి ఉపసర్పంచ్ ముమ్మనేని రాజ్ కుమార్ (నాని), శ్రీకాకుళం డీసీ ఛైర్మన్ అయినపూడి భాను ప్రకాష్ పేర్కొన్నారు. చిట్టూర్పు గ్రామంలోని మల్లేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని నిర్వహిస్తున్న మూడు జిల్లాల స్థాయి తాళం భజన పోటీలు గురువారం నాల్గవ రోజుకు చేరాయి. చిట్టూర్పులో తాళం భజన, మురళీ కోలాటం పోటీలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. న్యాయనిర్ణేతలుగా పొడుగు ప్రసాద్, శ్రీనివాసరావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కొడాలి పీఏసీఎస్ ఛైర్పర్సన్ గుత్తికొండ వరప్రసాద్, వేములపల్లి సుధీర్, దోనేపూడి శ్రీనివాస్, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తసమాజ సభ్యులు పాల్గొన్నారు.



గూడూరు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డీపీవో అరుణ

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గూడూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య సేవా శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీపీవో డాక్టర్ జె. అరుణ అన్నారు. గూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం ఆమె సందర్శించారు. అక్టోబరు 2 వరకు స్వచ్ఛతాహీ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 29 వరకు ఉచిత వైద్య సేవా శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. 27న జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో బందరు డివిజన్ పరిధిలోని 350 మంది పారిశుధ్య కార్మికులకు దుస్తులు, సబ్బులు, కొబ్బరినూనె కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. డీఎల్‌పీవో రజావుల్లా, ఏవో సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించాలి

చల్లపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుతో పేద మధ్యతరగతి వర్గాలకు బహుమతి ఇచ్చిందని కమర్షియల్ ట్యాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమీషనర్ మన్నెం స్వరూపరాణి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, డీలర్లతో సమావేశం నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు తొలుత చల్లపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో ఎం.ఎం.ఆనందకుమారి, పీడీఎస్ డీటీ శ్రీనివాసరావు, కార్యాలయ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ సామాజిక బాధ్యత

బంటుమిల్లి, సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ గమనించాలని ఎస్సై గణేష్‌కుమార్ అన్నారు. బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జగన్మోహనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహిళలకు రక్షణగా ప్రభుత్వం అనేక చట్టాలు చేసిందని తెలిపారు. పోక్సో చట్టం, శక్తి యాప్, వాడే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ జగన్మోహనరావు, దేవ జయరాజు, హిమాలినీ దేవి, సత్య రాకేష్, రామారావు, జోత్స్న, చలంప్రసాద్, నాగరత్నం, విద్యార్థినీ, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతి



మృతుడు నాగమల్లేశ్వరరావు

మోపిదేవి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉత్తరచిరువోలు లంక గ్రామానికి చెందిన నడకుదుటి నాగమల్లేశ్వరరావు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో కొన్ని సంవత్సరాలుగా సేవ చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తున్నాడు. గ్రామం నుంచి గురువారం మోపిదేవి వచ్చి పనిలో నిమగ్నమయ్యాడు. దేవస్థానం కార్యాలయంలో లోపలికి వెళ్లి వస్తుండగా కాలి నుంచి ఒక్కసారిగా రక్తం వస్తుండటంతో సహ ఉద్యోగులు గమనించారు. వెంటనే అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, చికిత్స చేస్తుండగానే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మార్గమధ్యలో కరకట్టపై సైకిల్ అదుపు తప్పి పడగా, విషపురుగు కుట్టినట్లు గమనించామని వైద్యులు తెలిపారు ఎస్సై వై.వి.సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు.



పాడి రైతులకు బోనస్ పంపిణీ

చల్లపల్లి, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి పాలకేంద్రంలో గురువారం అధ్యక్షురాలు బెల్లకొండ లక్ష్మి ఆధ్వర్యంలో పాడిరైతులకు బోనస్ పంపిణీ చేశారు. 2024 ఏప్రిల్ 1 నుంచి తేదీ 2025 మార్చి 31 వరకు వచ్చిన సంఘం లాభాల్లో 70 శాతం రూ.1,54,933లను 210 మందికి బోనస్‌గా పంపిణీ చేశారు. పాలకేంద్రానికి అత్యధికంగా పాలు పోసిన మొదటి ముగ్గురు రైతులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. బీఎంసీ ఏఎంపీవో తమ్మన సురేష్‌కుమార్, కార్యదర్శి గొరిపర్తి మురళీకృష్ణ, పాలకవర్గ సభ్యులు, పాడిరైతులు పాల్గొన్నారు.

పరకామణిలో చోరీ మహాపాపం

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో భక్తులు కానుకలు వేసే పరకామణిలో కోట్లాది రూపాయలు చోరీ జరిపిన వైసీపీ నాయకులను దేవుడితో పాటు ప్రజలు కూడా క్షమించరని జిల్లా టీడీపీ ప్రచారకార్యదర్శి పి.వి.ఫణికుమార్ ధ్వజమెత్తారు. వివిధ ప్రధాన సెంటర్లలో గోడలకు టీడీపీ నాయకులు వాల్‌పోస్టర్లను అంటించారు. ప్ల కార్డులతో ప్రదర్శన నిర్వహించారు. గుడిని, గుడిలోని హుండీని దోచే జగన్ గ్యాంగ్ పాపం పండిందన్నారు. రోజు రోజుకు వీడియోలు బయట పడుతున్నాయన్నారు. తిరుమల జోలికి వెళ్లిన వారు చరిత్ర హీనులయ్యారని గుర్తు చేశారు.



మోపిదేవి బస్టాండ్ సెంటర్‌లో



శ్రీకాకుళంలో కాత్యాయనిగా..



లక్ష్మీపురం శివాలయంలో



కప్పలదొడ్డిలో..



బందరులోని ఈడేపల్లిలో లలిత సహస్రనామ పారాయణ చేస్తున్న భక్తులు

కాత్యాయనిగా జగన్మాత

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రధాన దేవాలయాల్లో గురువారం జగన్మాత్మ కాత్యాయనిగా పూజలందుకున్నారు. మహిళలు సామూహికంగా లలిత సహస్ర నామ పారాయణ చేశారు. రాబర్ట్సన్‌పేట రామలింగేశ్వర స్వామి, బచ్చుపేట భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి, కొజ్జిల్లిపేట నాగేశ్వరస్వామి, సర్కిల్‌పేట మల్లేశ్వర స్వామి, ఈ డేపల్లి శక్తిగుడి, కోనేరుసెంటర్‌లోని కన్యకా పరమేశ్వరీ, భాస్కరపురం త్రిశక్తి పీఠం లలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. దేవాలయాల్లో సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించారు. ఈవోలు అంజనేయ స్వామి, రాచపూడి మాధవీలతలు పర్యవేక్షించారు. కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో మామిడి మురళీకృష్ణ, మోటమర్రి బాబాప్రసాద్, సామా లక్ష్మీకాంతరావు, బైసాని హయగ్రీవరావు, ఉడత్తు శ్రీనివాసరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. **పెడన:** పెడన పైడమ్మ అమ్మవారు ఇష్టకామేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కూనపరెడ్డి సురేష్, కుమారి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈవో జీ.వి. కృష్ణారావు, వ్యవస్థాపక ధర్మకర్త దాసు వాసు, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు. కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో గురువారం అమ్మవారు కాత్యాయని దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. **గూడూరు** : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ఐదవ రోజుకు చేరాయి. కప్పలదొడ్డిలోని చౌడేశ్వరీ అమ్మవారు కాత్యాయనీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గుత్తి శివశంకరరావు, స్వరూపరాణి దంపతులు పూజలు నిర్వహించారు.**బంటుమిల్లి** : నాల్గవ రోజైన గురువారం అమ్మవారు పలు విశేష అలంకారల్లో భక్తులకు దర్శనమిచ్చారు. పెదతుమ్మిడిలో వైష్ణవిదేవిగా, బంటుమిల్లిలో కాత్యాయనిగా, పాశ్చాపురం ఆంజనేయ స్వామి ఆలయం, అర్తమూరులో కాత్యాయనిగా దర్శనమిచ్చారు. **కోడూరు** : శ్రీదేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ కాత్యాయనీదేవిగా దర్శనమిచ్చారు. రాక్షస సంహారం కోసం ఆమె కాత్యాయనీ రూపంలో ఉన్నారని అర్చకులు తెలిపారు.



మెహర్ నృత్యనికేతన్ విద్యార్థినిలతో దాలిపర్తి మెహర్ దుర్గానరసింహారావు

ఆకట్టుకున్న కూచిపూడి నాట్యప్రదర్శనలు

చల్లపల్లి : శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శ్రీకన్యకా పరమేశ్వరీ అమ్మవారి కల్యాణ మండపంలో జరిగిన కూచిపూడి నాట్యప్రదర్శనలు విశేషంగా అలరించాయి. చల్లపల్లి శ్రీమెహర్ నృత్య నికేతన్ నాట్యాచార్యులు దాలిపర్తి మెహర్ దుర్గానరసింహారావు శిష్యబృందం 22 మంది నాట్య ప్రదర్శనలు చేశారు. మొత్తంగా 12 పాటలకు అద్భుతంగా నర్తించి ప్రేక్షకుల కరతాళధ్వనులందుకున్నారు. కూచిపూడి సంప్రదాయంలో నృత్యరూపకం, కోలాటం మేళవించి చేసిన నృత్యం ఆకట్టుకుంది. రెండో తరగతి నుంచి 9వ తరగతి వరకూ చదివే విద్యార్థినిలు కూచిపూడి నాట్యప్రదర్శనలు చేశారు. నాట్యాచార్యులు దాలిపర్తి మెహర్ దుర్గానరసింహారావును కమిటీ పెద్దలు సన్మానించి విద్యార్థినులకు జ్ఞాపికలు అందజేశారు. కమిటీ పెద్దలు కొల్లిపర మధు, అన్నవరపు పాండురంగారావు, గోళ్ల రాంప్రసాద్, తమ్మన సతీష్‌కుమార్, చుండూరు మెహర్, వరదా రాజశేఖర్, నరేంద్ర పాల్గొన్నారు.

ఈవో జయశ్రీ ఏర్పాట్లు పర్యవేక్షించారు. **నాగాయలంక** : గణపేశ్వరంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. కన్యకా పరమేశ్వరీ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, పార్వతీ అమ్మవారు కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చిట్టా సాంబశివరావు పర్యవేక్షించారు. కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు కాత్యాయనీ దేవిగా దర్శనమిచ్చారు. **అవనిగడ్డ** : రాజశేఖరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరి దేవి, దివి ప్రజల ఇలవేల్పు లంకమ్మ అమ్మవారు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కంచికామాక్షమ్మ ఆలయంలో విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి భావరాజు ఫణి కుమార్ దంపతులు అమ్మవారికి రుద్రాభిషేకం నిర్వహించారు. **అవనిగడ్డ రూరల్** : తుంగలవారిపాలెంలో అమ్మగారమ్మను కాత్యాయనీదేవిగా అలంకారం చేశారు. పులిగడ్డ కనకదుర్గమ్మ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకనూరులో మాదివాడ వారి అంకాలమ్మ కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. **మోపిదేవి** : పెదకళ్లేపల్లి దుర్గా నాగేశ్వర స్వామి, కొక్కిలిగడ్డ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, వెంకటాపురం, పెదప్రోలు గ్రామాల్లో అమ్మవార్లకు భక్తులు కుంకుమార్చనలు నిర్వహించారు. మోపిదేవి బస్టాండ్ సెంటర్‌లో అమ్మవారిని బూరగడ్డ శ్రీనాథ్, కమిటీ సభ్యులు దర్శించుకుని పూజలు చేశారు. **ఘంటసాల** : శ్రీకాకుళంలోని ముదిరాజ్ రామాలయం వద్ద శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం గ్రామసర్పంచ్ ముప్పనేని రవి ప్రసాద్ దంపతులు పీటల మీద కూర్చుని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కోడి చిన్నవెంకట స్వామి - చిన్న కృష్ణవేణి, కమిటీ సభ్యు లు పాల్గొన్నారు. ఘంటసాలలోని శ్రీరామాలయం వద్ద ఆర్.వి.ఎస్.సుధాకర్ శర్మ ఆధ్వర్యంలో కాత్యాయనీదేవిగా అలంకరించారు. వక్కలగడ్డ దుర్గా ప్రసాద్ - పెద్దింట్లమ్మ దంపతులు విశేష పూజలుచేశారు. అమ్మవారిని శ్రీకాకుళం డీసీ ఛైర్మన్ అయినపూడి భాను ప్రకాష్ దర్శించుకుని పూజలు చేశారు. కమిటీ సభ్యులు దుర్గాభవాని, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, రాముడు, సత్యనారాయణ, ప్రసాద్, భవాని పాల్గొన్నారు. **చల్లపల్లి** : అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వరస్వామిఆలయం, కన్యకా పరమేశ్వరీ ఆలయం, పృధ్వీశ్వర క్షేత్రంలో బాలాత్రిపురసుందరీ దేవి, లక్ష్మీపురం దుర్గాపార్వతీసమేత సోమేశ్వరస్వామి ఆలయం, లక్ష్మీనాంచారమ్మ, రామానగరం క్లబ్‌రోడ్‌లోని ఉత్సవపందిరితోపాటు పలు గ్రామాల్లోని ఆలయాలు, ఉత్సవ పందిళ్లలో అమ్మవారు కాత్యాయినీదేవిగా భక్తులకు దర్శనమిచారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పృధ్వీశ్వరక్షేత్రంలో సామూహిక కుంకుమార్చనలు జరిపారు.



ఎస్ఎన్ గొల్లపాలెం, గూడూరులో స్వచ్ఛతా హి సేవలో పాల్గొన్న కలెక్టర్ డీకే బాలాజీ



కానూరులో మొక్క నాటుతున్న గోపు సత్యనారాయణ

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

● స్వచ్ఛతా హి సేవలో కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్/గూడూరు, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమని కలెక్టర్ బాలాజీ అన్నారు. ఎస్ఎన్ గొల్లపాలెంలో ఎంపీడీవో వెంకటేష్ ఆధ్వర్యంలో ఏక్ దిన్.. ఏక్ గంటే. ఏక్ సాథ్ కార్యక్రమం జరిగింది స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ నాగమణి, డివిజనల్ పంచాయతీ అధికారి రజావుల్లా తదితరులు పాల్గొన్నారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా గురువారం గూడూరులో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో గ్రామస్తులు పిచ్చిమొక్కలు, చెత్తా చెదారాలను తొలగించే కార్యక్రమాన్ని పరిశీలించారు. డీఎల్‌పీవో రజావుల్లా, ఎంపీడీవో రామకృష్ణ, గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, ఎంపీటీసీ సభ్యుడువేముల సురేష్‌రంగ బాబు, సర్పంచ్ లింగం సులోచనారాణి, విజయ్‌కుమార్, ఎన్ఏ బేగ్, ఈవో భాస్కరరావు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జడ్పీ సెంటర్‌లో..

మచిలీపట్నం టౌన్ : జడ్పీ సెంటర్‌లో ఏక్ దిన్, ఏక్ సాథ్, ఏక్ గంటే నినాదంతో పరిసరాల పరిశుభ్రతకు నడుంబిగించారు. మునిసిపల్ కమిషనరు బాపిరాజు, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, జిల్లా ప్రచార కార్యదర్శి ఫణికుమార్, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, సురేష్, జనసేన నాయకుడు పినిశెట్టి వేణు తదితరులు చీపుళ్ళు పట్టి వీధులు ఊడ్చారు. పారిశుధ్యం, పచ్చదనంతో అందరి ఆరోగ్యం ముడిపడి ఉందని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గోపు సత్యనారాయణ అన్నారు. కానూరు గ్రామంలో నిర్వహించిన ఏక్ దిన్. ఏక్ గంటే కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గోపు సత్యనారాయణ పాల్గొన్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ముళ్లపొదలను తొలగించి మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, మోపిదేవి కృష్ణ, బి.నాని, ఈమన సత్యనారాయణ, చక్కా రా మారావు, నాగాంజనేయులు, మోకా శ్రీను,పి. వాణి, బొట్ల రాజేష్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా నగరంలోని బస్టాండ్ వద్ద బెల్ కంపెనీ ఉద్యోగులు స్వచ్ఛతాహీ కార్యక్రమం నిర్వహించారు.

పెడన మండలంలో..

పెడన రూరల్ : గ్రామాలు పరిశుభ్రతతో ఉన్నట్లయితే ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉంటారని డీడీవో పద్మావతి అన్నారు. బల్లిపర్రు అంగన్‌వాడి, పాఠశాలలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహించారు. చెన్నూరు, ఉరివి, నడుపూరు, మడక, నందమూరు గ్రామ పంచాయతీలలో చెత్త తొలగింపు పనులు చేపట్టారు. నాగిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్** : పులిగడ్డలో సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, కార్యదర్శి అనిత ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలు నిర్వహించారు. రోడ్లను శుభ్రపరిచారు. ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు సుబ్రహ్మణ్యం, రాజు, ప్రభు, ప్రభాకర్, నవ్య, రాంప్రసాద్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే సమస్యలకు సత్వర పరిష్కారం: ఎస్పీ

మచిలీపట్నం క్రైమ్ సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు అన్నారు. ట్రైనీ ఐఏఎస్ ఫర్హీన్ జహిదా గురువారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించారు. మహిళా- శిశు భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, ట్రాఫిక్, ప్రజా భద్రత కోసం పోలీసులు తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ అవగాహన కల్పించారు. జిల్లా పరిధిలోనిర్వహిస్తున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలు, ప్రజల సహకారంతో అమలు చేస్తున్న నేర నియంత్రణ చర్యలు, శాంతి భద్రతకు వినియోగించే సాంకేతికత వివరించారు.

కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

మచిలీపట్నం టౌన్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. శివన్నారాయణ అన్నారు. మచిలీపట్నంలో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జ యంతి కార్యక్రమం జరిగింది. శివన్నారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పంతం గజేంద్ర, మురళీకృష్ణ, పుప్పాల రాము, విజయకుమార్, ప్రసన్నకుమార్, పద్మరాజు, శ్రీరామచంద్రమూర్తి, పాండురంగారావు, గంటా సురేష్, సునీల్, హరిరామకృష్ణ పాల్గొన్నారు **కోడూరు** : కోడూరులో పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. మొక్కలు నాటారు. నాగబాబు, వెంకటగిరి, కోట సత్యనారాయణ, సుబ్బారావు, కాకాని, అద్దెపల్లి శ్రీనివాస్, యోగానంద్ పాల్గొన్నారు.

నూతన వరి వంగడాలు క్షేత్రస్థాయిలో పరిశీలన

అవనిగడ్డ, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ గ్రామ పరిధిలోని వరి పొలాలను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. నూతన వరి వంగడాలు, అభ్యుదయ రైతుల పొలా ల్లో చిరు సంచుల రకాలను పరిశీలించి రైతుల అనుభవాలను నమోదు చేయటం జరుగుతుందని కో-ఆర్డినేటర్ డా.డి.సుధారాణి తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీడీఏ జ్యోతి రమణి, అవనిగడ్డ ఏడీఏ జయప్రద, ఏడీఏ శ్రీనివాస్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రేవతి, వెంకటలక్ష్మి, ఏవో పద్మజ, సంజీవ్, హారిక, విఏఏలు పాల్గొన్నారు.

వైద్యసేవలను వినియోగించుకోవాలి

పెడన రూరల్, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెదనందమూరు అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహర మాసోత్సవాలు నిర్వహించారు. మహిళలు, బాలింతలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి మీనాదేవి అన్నారు. ప్రభుత్వం ప్రజల వద్దకే వైద్య సేవలను అందిస్తుందని, అన్ని రకాల రక్తపరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఆరోగ్యకర ఆహార అలవాట్లపై చర్చ నిర్వహించారు. ఊబకాయం వలన ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. 45 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ప్రజలు తరచుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సర్పంచి పరసా నరసింహారావు, సెక్రటరీ జానకీదేవి, ఎఎన్‌యం ఉమాదేవి, అంగన్‌వాడి కార్యకర్తలు బి విశలేశ్వరి, నాగమణి, శేషారత్నం, కృష్ణకుమారి పాల్గొన్నారు.

ఏఎంసీ సమావేశంలో ఏడు తీర్మానాలు ఆమోదం

నాగాయలంక, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): నాగాయలంకలోని దివి వ్యవసాయ మార్కెట్ యా ర్డు కార్యాలయంలో గురువారం పాలకవర్గం ద్వితీయ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు యార్డు పరిధిలోని ఏడు అంశాలను సమావేశంలో ప్రతిపాదించగా, సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోస్టల్ పాలసీదారునికి రూ.4 లక్షల చెక్కు

నాగాయలంక, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): టి.కొత్తపాలెం గ్రామానికి చెందిన బండ్రెడ్డి బసవరావు గతేడాది పోస్టాఫీసులో గ్రూపు యాక్సిడెంట్ గార్డు (గాగ్) పథకంలో కేవం రూ.399 కట్టి చేరాడు. ఇటీవల ఆయన రోడ్డు ప్రమాదం జరిగి విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. కాలుకు తీవ్ర గాయాలు కావటంతో కొంత భాగాన్ని తొలగించారు. ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. వైద్య ఖర్చులకు గాగ్ పాలసీకి దరఖాస్తు చేసుకోగా, బసవరావుకు రూ.4 లక్షలు వైద్య ఖర్చులు నిమిత్తం మంజూరయ్యాయి. మచిలీపట్నం పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ నాగరాజు, అనుదీప్ తదితరులు చెక్కును అందజేశారు. భోగాది బాల, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.